ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 3 డిసెంబరు 2024



థ్యాంక్యూ సర్..!

బాలల దినోత్సవంలో పాల్గొన్న ఎస్పీ జగదీష్ దంపతులకు అనంతపురం పోలీస్ కాంప్లెక్స్ ప్రీ ప్రైమరీ స్కూల్ చిన్నారులు సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. డీపీఓలో ఎస్పీని కలిశారు.
- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం

ఆయుష్ పేరుతో అక్రమాలు..!

- ఆయుష్ వైద్యం ముసుగులో 'వ్యాపారం
- అనుమతిలేకుండానే ఆస్పత్రులు, షాపుల నిర్వహణ
- విజిలెన్స్ తనిఖీల్లో బట్టబయలైన అక్రమాలు
- అనంతలో నాలుగు ఆస్పత్రులు, మందుల షాపుల సీజ్

6



పప్పుశనగ పంటకు తెగుళ్లు

- పిచికారీ తప్పక చేయాలంటున్న వ్యవసాయాధికారులు
- రైతులపై మరింత ఆర్థికభారం

6



హద్దులు చెరిపేస్తున్నారు..!

- భూముల రీసర్వే పేరుతో హద్దురాళ్లు
- అప్పట్లో పాతేందుకు ఒక్కోరాయికి రూ.150 ఖర్చు
- వైసీపీ ప్రభుత్వంలో ప్రజాధనం దుర్వినియోగం
- కూటమి పాలనలో తొలగింపు ప్రక్రియ

7



ప్రభుత్వ విద్యార్థికీ.. ప్రోగ్రెస్ కార్డు..!



- స్కూళ్లలో సరికొత్త ప్రయోగం
- తల్లిదండ్రుల ఎదుటే నివేదిక
- సమగ్ర ప్రగతిపత్రం అందజేతకు శ్రీకారం
- 1740 స్కూళ్లలో ప్రోగ్రెస్ పండుగ
- 7న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్
- జిల్లావ్యాప్తంగా చురుగ్గా ఏర్పాట్లు
- రూ.42 లక్షల నిధులు విడుదల

'పిల్లలు ఏం చదువుతున్నారు...? ఎలా చదువుతున్నారు..? ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారు..? ఎన్ని మార్కులొస్తున్నాయో...?!.' ఇలాంటి సందేహాలు ప్రతి తల్లి, తండ్రిని తొలిచేస్తుంటాయి. ఆ విషయాలు తెలియాలంటే... విద్యార్థుల చదువు, ప్రతిభ గురించే తెలియజేసే ప్రోగ్రెస్ కార్డులు ఉండాల్సిందే. ఆ మాట ఇన్నాళ్లూ ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో మాత్రమే వినిపించేది. ఇక ప్రభుత్వ స్కూళ్లలో కూడా ప్రోగ్రెస్ కార్డు కనపడనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా ప్రోగ్రెస్ కార్డు అందనుంది. హోలిస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్ట్ పేరుతో విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ అపురూప వేడుకను 'మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్' పేరుతో 7వ తేదీన నిర్వహించనున్నారు. - ఆంధ్రజ్యోతి, అనంతపురం విద్య



జిల్లాకు చేరిన హోలిస్టిక్ కార్డులు

జిల్లాలో 1740 స్కూళ్లలో..

అనంతపురం జిల్లా వ్యాప్తంగా 1740 స్కూళ్లలో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించనున్నారు. ఈ వేడుకలను పండుగలా నిర్వహించేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా ప్రతి స్కూలును ముస్తాబు చేసి వేడుకగా చేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.42 లక్షల నిధులు విడుదల చేసింది. దీంతో సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులు జిల్లాలోని 32 మండలాల ఎంఈఓలకు ఆ నిధులు విడుదల చేశారు. అన్ని స్కూళ్లలో వేడుక నిర్వహణకు డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

2.10 లక్షల మందికి ప్రోగ్రెస్ కార్డులు

అనంతపురం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందించనున్నారు. 1740 స్కూళ్లలో 2.10 లక్షల మందికి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందించనున్నారు. ఈ నెల 7న నిర్వహించే వేడుకలకు ప్రజాప్రతినిధులను, అన్ని రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానించనున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి తరగతి గదుల్లో వాళ్లను కూర్చోబెట్టి.. వారి పిల్లలు స్కూళ్లలో చదువుతున్న తీరు, వచ్చిన మార్కులు, విద్యార్థుల ప్రతిభపై హోలిస్టిక్ కార్డులు అందించి ఉపాధ్యాయుల క్షుణ్ణంగా వివరించనున్నారు.

ప్రతి పాఠశాలలో సమావేశం



ప్రతి పాఠశాలలోనూ మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించాలని విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 1740 స్కూళ్లలో మెగా పీటీఎం నిర్వహించబోతున్నాం. ఇప్పటికే రూ. 42 లక్షలు ఎంఈఓలకు విడుదల చేశాం. ఇప్పటి వరకూ ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులకే ఈ కార్డులు అందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఇప్పుడు సర్కారీ స్కూళ్ల విద్యార్థులకు ఆ కార్డులు అందనున్నాయి. ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులకు పిల్లల చదువుపై జవాబుదారీతనం పెంచడమే ఈ వేడుక వెనుక ఉన్నముఖ్య ధ్యేయం.
- ప్రసాద్‌బాబు, డీఈఓ, అనంతపురం

ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి ఊతం



గత ప్రభుత్వంలో విద్యాశాఖ పతనావస్థకు చేరింది. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో మళ్లీ బడులు బలోపేతం అవుతాయన్న నమ్మకం ఉపాధ్యాయలోకంలో కలుగుతోంది. స్కూళ్లలో మెగా పీటీఎం నిర్వహించడం హర్షణీయం. ముఖ్యంగా తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూ...వాళ్లను స్కూళ్లకు పిలిపించి, పిల్లల చదువుపై ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వడం నిజంగా ప్రభుత్వ విద్యారంగంలో నవశకమనే చెప్పాలి.
-కిష్టప్ప, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, టీఎన్‌యూఎస్

విద్యార్థి వికాసానికి వేదిక



ఈనెల 7న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్(పీటీఎం) నిర్వహించనుండటం శుభపరిణామం. ముఖ్యంగా పాఠశాలల బలోపేతానికి, విద్యార్థి వికాసానికి ఈ మీటింగ్ దిక్సూచిగా నిలుస్తుంది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య వారధిగా ఉంటుంది. రాజకీయాలకు అతీతంగా పీటీఎం నిర్వహించనుండటం ఆనందంగా ఉంది. ఇలాగే ప్రభుత్వం పిల్లలకు మరింత నాణ్యమైన విద్యను అందించేందుకు మెరుగైన నిర్ణయాలు తీసుకుని ముందుకు కదలాలని ఆశిస్తున్నాం.
-రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి, గిరిజన ఉపాధ్యాయ సంఘం

హంద్రీనీవాను పట్టించుకోని వైసీపీ

- ఐదేళ్లలో ఒక్క అడుగూ ముందుకువేయలేదు
- రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



అధికారులతో వివరాలు తెలుసుకుంటున్న మంత్రి కేశవ్

బెళుగుప్ప, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) వైసీపీ పాలనలో హంద్రీనీవా పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. మండలంలోని కోనాపురం వద్దనున్న 11వ పంపుహౌస్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ విద్యుత్ సబ్‌స్టేషను నిర్మాణానికి రూ.2.71 కోట్లు విడుదల చేశామన్నారు. అనంతరం ట్రాన్స్‌కో, హెచ్ఎన్ఎస్ఎస్, రెవెన్యూ అధికారులతో హంద్రీనీవా వేగవంతానికి చర్యలు తీసుకోవడంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు క్షేత్రస్థాయికు వెళ్లి కల్వర్టుల నిర్మాణం, భూసేకరణ తదితర వివరాలను అడిగి తెలుసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా కాలువలపై కల్వర్టులను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ హంద్రీనీవా గురించి అయిదేళ్లలో వైసీపీ పట్టించుకోలేదన్నారు. మండలంలో ప్రతి చెరువుకు హంద్రీనీవా నీరందించడమే తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షర్మిల, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, హెచ్ఎన్ఎస్ఎస్ సీఈ నాగరాజు, ఈఈ శ్రీనివాసనాయక్, డీఈలు రమణ, చంద్ర శేఖర్, ఇంజనీర్లు సుదర్శన్, సర్వరాజ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పథకాన్ని అనుసంధానం చేయాలి

ఉపాధి హామీ పథకాన్ని ఉద్యాన రైతులకు అనుసంధానం చేసి ఆదుకోవాలని జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ సభ్యులు సర్పంచ్ రాము, టీడీపీ నాయకులు ఎలగలవంక సురేష్‌లు మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందించారు. పరిశీలిస్తామని మంత్రి తెలిపారు.



అనంతపురంలో కురుస్తున్న వర్షం

చిరు జల్లులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం వర్షం కురిసింది. అనంతపురం, కూడేరు మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. గార్లదిన్నె, శింగనమల, తాడిపత్రి, పుట్లూరు, ఉరవకొండ, యాడికి, కుందుర్పి, గుత్తి, బెళుగుప్ప, విడపనకల్లు, పెద్దవడుగూరు, బొమ్మనహాళ్ తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. ఆదివారం అనంతపురం, పామిడి మండలాల్లో తుంపర జల్లులు పడ్డాయి. గత రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉన్నా వర్షం పడలేదు.

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

- కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



బాధితుల వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

అనంతపురం టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల వేదికకు ప్రజలనుంచి వస్తున్న ఫిర్యాదులను పక్కాగా పరిశీలించి, గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం వివిధ సమస్యలతో వచ్చిన 380మంది నుంచి అర్జీలను స్వీకరించారు. కలెక్టరుతో పాటు జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, డీఆర్ఓ మలోల, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తదితరులు వినతులు స్వీకరించారు. కలెక్టరు అర్జీదారుల వద్దకే వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో ఏఒక్కరు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలులో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలన్నారు.

- తొలిసారి జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సభను విజయవంతం చేసినందుకు అధికారులను కలెక్టరు ప్రశంసించారు. జిల్లా ఎస్పీ, కళ్యాణదుర్గం ఆర్డీఓ, సీపీఓ, ఆర్ అండ్‌బీ ఎస్ఈ, పోలీస్ వ్యవస్థ బాగా పనిచేశాయన్నారు. పింఛన్ల పంపిణీలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపిన డీఆర్‌డీఏ అధికారులు, సచివాలయ సిబ్బంది, జేసీ కృషి ప్రశంసనీయమన్నారు.

సర్వజన ఆస్పత్రిలో తల్లీబిడ్డ మృతి



అనంతపురం టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సర్వజన వైద్యశాలలో సోమవారం ప్రసవం సమయంలో తల్లీబిడ్డ మృతిచెందారు. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించగా, కార్డియాక్ అరెస్ట్‌తో బాధితురాలు ఆస్పత్రిలో చేరారని, దీనికితోడు రక్తహీనత ఉండటంతో చనిపోయారని వైద్యులు అంటున్నారు. రాయదుర్గం పట్టణానికి చెందిన సరళజ్యోతి(30) గత నెల 27న కార్డియాక్ అరెస్ట్‌తో అనంతపురం జిల్లా ఆస్పత్రి వచ్చారు. ఆమె 8 నెలల గర్భిణి. రక్త హీనత ఉన్నట్లు గుర్తించారు. అడ్మిషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఆమె సోమవారం బాత్‌రూమ్‌కు వెళ్లి కింద పడిపోయారు. వైద్యులు వెంటనే ఆపరేషన్ థియేటర్‌కు తీసుకువెళ్లి వెంటిలేటర్‌పై ఉంచి సిజేరియన్ చేశారు. ఆ సమయంలో తల్లీబిడ్డ మృతిచెందారు. డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని సరళజ్యోతి భర్త మంజునాథ్, బంధువులు ఆరోపించారు. ఇప్పటికే ఆమెకు మూడు కాన్పులు అయ్యాయని, రక్తహీనత ఉందని వైద్యులు అన్నారు. విచారణకు కమిటీని ఏర్పాటు చేస్తామని, వైద్యుల తప్పు ఉంటే చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

నైపుణ్యాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేయండి

- కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ అంబికా

అనంతపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నైపుణ్యాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేయాలని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరిని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఆయన సోమవారం కేంద్రమంత్రిని ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసినట్లు తెలిపారు. కరువు జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో సూర్యరశ్మిని ఉపయోగించుకొని, ఇంధన పర్యావరణ వ్యవస్థ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే నైపుణ్య శిక్షణ సంస్థలు ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు. లోక్‌సభలో కూడా ఇదే అంశంపై ఎంపీ అంబికా మాట్లాడారు.



కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న, ఎంపీ అంబికా

శవాలపై ఖాకీలు..!



- మృతదేహం పైకి లేవాలంటే లంచం ఇవ్వాల్సిందే
- పోస్టుమార్టం చేయడానికి.. కేసు పేపర్లకు సైతం..
- డాక్టర్లు, అంబులెన్స్ పేరుతో వసూలు
- మితిమీరిన కిందిస్థాయి పోలీసుల ఆగడాలు

బుక్కరాయసముద్రం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కొందరికి శవాలు సైతం కాసులు కురిపిస్తున్నాయి. వివిధ సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నా, రోడ్డు ప్రమాదాలు, అనుమానాస్పద స్థితిలో మృతి చెందినా పోస్టుమార్టం తప్పనిసరి. ఇదే అదనుగా కొందరు కిందిస్థాయి పోలీసులు, వైద్య సిబ్బంది చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. అయినవారిని పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో ఉన్నా బాధితులను వదలడం లేదు. పైసలిస్తే తప్ప పని జరగని స్థితికి తీసుకొచ్చారు. శింగనమల సర్కిల్ పరిధిలో నార్పల, శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం అప్‌గ్రేడ్ స్టేషన్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో ఆత్మహత్యలు, ప్రమాదాల్లో మృతి చెందిన వారికి అనంతపురం సర్వజన ఆస్పత్రిలో పోస్టుమార్టం జరుగుతుంది. అయితే కిందిస్థాయి సిబ్బందికి లంచం ఇవ్వందే శవం మార్చురీలోకి వెళ్లదు, బయటకు రాదు అనే పరిస్థితి ఉంది. ఈ అవినీతి దందా అనేక సంవత్సరాల నుంచి జరుగుతున్నా ఉన్నత స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు..

- ఇటీవల బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి గ్రామంలో నాగేంద్ర అనే యువకుడు అప్పుల బాధతాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. బుక్కరాయసముద్రం స్టేషన్ పరిధిలోని ఓ ఇద్దరు కానిస్టేబుళ్లు సంఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. శవాన్ని అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించాలంటే రూ.9వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సార్..! అంత ఇచ్చుకోలేము. మా దగ్గర రూ.3వేలు ఉంది. అంతకన్నా ఎక్కువ ఇవ్వలేము అన్నారు. అడిగినంత డబ్బులిస్తేనే అంబులెన్స్‌లో శవం పెట్టండి. లేక పోతే మీరే ఎలాగైన తీసుకెళ్లండి అని ఆ ఇద్దరు పోలీసు సిబ్బంది బాధితులకు ఖరాకండిగా చెప్పినట్లు సమాచారం. దీంతో బాధితులు మృతదేహాన్ని ద్విచక్రవాహనంలో ఉంచుకుని పోస్టుమార్టం కోసం దాదాపు 12 కిలోమీటర్ల దూరంలోని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. 12 కిలోమీటర్ల దూరానికి రూ.9వేలు డిమాండ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. నానా తంటాలు పడి శవాన్ని ఆస్పత్రికి తీసుకువస్తే, పోలీసులు ఇచ్చిన కేసు వివరాల పేపర్లు ఇస్తేనే మార్చురీలోకి తీసుకుంటామని అక్కడి సిబ్బంది తెలిపారు. దీంతో బాధితులు తిరిగి పోలీసుల వద్దకు వెళ్లారు. అప్పుడు కూడా డబ్బులు అడిగితే ఇవ్వరా అంటూ అరగంట పాటు మార్చురీ బయటే మృతదేహం ఉంచినట్లు సమాచారం. చివరికి ఓ టీడీపీ నాయకుడు జోక్యం చేసుకుని ఫోన్ చేస్తే, అప్పుడు మృతదేహానికి సంబంధించి కేసు వివరాలు, స్లిప్‌ను మార్చురీ సిబ్బందికి ఇచ్చారు.



బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్

దీంతో అప్పుడు మృతదేహాన్ని మార్చురీలోకి పెట్టినట్లు సమాచారం.

- శింగనమల మండలంలోని నాయనవారిపల్లి గ్రామంలో ఇటీవల ఓ మహిళ అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించేందుకు బాధితుల నుంచి రూ.ఏడువేలు వసూలు చేసినట్లు సమాచారం. ఈ డబ్బులు మాకు కాదు... పోస్టుమార్టం చేసే డాక్టర్లు, మార్చురీలో పనిచేసే సిబ్బందికి అంటూ పోలీసులు సన్నాయి నొక్కులు నొక్కినట్లు సమాచారం.
- రెండు నెలలు కిందట పుట్లూరు పోలీసుస్టేషన్ పరిధిలో అనంతపురం-తాడిపత్రి రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి ఇన్సూరెన్స్ వర్తిస్తుండటంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. దాదాపు రూ.రెండు లక్షల వరకు వైద్య ఖర్చు అయ్యింది. ఇన్సూరెన్స్ కోసం కింది స్థాయి పోలీసు సిబ్బంది కేసు ధ్రువీకరణ పత్రం ఇవ్వడానికి రూ.ఐదు వేలు వసూలు చేసినట్లు సమాచారం. శింగనమల సర్కిల్, బుక్కరాయసముద్రం అప్‌గ్రేడ్ స్టేషన్‌లో కొంత మంది ఖాకీలు విషాద సమయాల్లో బాధితులకు చుక్కలు చూపిస్తున్నారు.

లంచం తీసుకుంటే చర్యలు



రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు, ప్రమాదవశాత్తు మరణించిన సమయాల్లో పోస్టుమార్టం కోసం పోలీసు సిబ్బంది ఎక్కడైనా లంచం అడిగినట్లు తేలితే చర్యలు తప్పవు. అలాంటి సిబ్బందిపై విచారణ చేపట్టి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. దీంతోపాటు అనంతపురం ప్రభుత్వాస్పత్రి వద్ద ఉన్న అంబులెన్స్ వాహనయజమానులు, డ్రైవర్ల పై ప్రత్యేక నిఘా ఉంచి మృతదేహాలను తరలించేందుకు అధిక వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. ఈ విషయంపై అనంతపురం డీఎస్పీతో చర్చించి, అధిక వసూళ్లకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటాం.
- వెంకటేశ్వర్లు, అనంతపురం రూరల్ డీఎస్పీ

న్యూస్ బాక్స్

9న సర్టిఫికెట్ల వెరిఫికేషన్

అనంతపురం కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ పరిధిలో అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 9న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. కర్నూలులోని ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ అహ్మద్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఎన్‌సీవీటితోపాటు కులధ్రువీకరణ పత్రం, వికలాంగులైతే అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్కు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు 2, ఆధార్ కార్డు జిరాక్స్‌కాపీలతోపాటు రూ.118లు వెరిఫికేషన్ ఫీజుతో కర్నూలులోని ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాలకు చేరుకోవాలన్నారు. డీజిల్ మెకానిక్ ట్రేడ్ అభ్యర్థులకు ఈనెల 9న ఉదయం 9 నుంచి మ ధ్యాహ్నం 1 గంట వరకు, అలాగే మోటా ర్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటింగ్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ పనులకు సంబంధించి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు. వివరాలకు 08518 257025 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహిస్తున్న డీఎస్సీ ఉచిత శిక్షణకు జిల్లాలోని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కుష్బూకొఠారీ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఇదివరకే దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో టెట్ అర్హత సాధించిన బీసీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ కింద ఈబీసీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. టెట్‌లో అర్హతలో సాధించిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు టెట్ మార్కుల జాబితా, టీసీ, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంకు పాస్ బుక్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో కలెక్టరేట్ దగ్గర ఉన్న బీసీ స్టడీ సర్కిల్లో దరఖాస్తులను అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్షలోపు ఉండాలన్నారు. వివరాలకు సెల్ : 7799043773 సంప్రదించాలన్నారు.

క్రీడాభారతి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శాప్ అనుబంధంగా ఉన్న చైతన్యకశ్యప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేసే క్రీడాభారతి అవార్డులకు అర్హులైన క్రీడాకారులు ఈనెల 4లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్‌భాస్కర్ తెలిపారు. 12 సంవత్సరాలుపైబడిన క్రీడాకారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విజేతలను ఎంపిక చేయడానికి ఈనెల 8న క్రీడా పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష 25 నిముషాల పాటు ఉంటుందని, 50 ప్రశ్నలు ఉంటాయన్నారు. ఆన్‌లైన్ క్రీడా పరీక్షలో ఉత్తీర్ణులైన విజేతలకు మొదటి బహుమతిగా రూ.1లక్ష, ద్వితీయ స్థానంలో నిలిచిన ఇద్దరికి చెరో రూ.50వేలు, తృతీయ స్థానంలో నిలిచిన ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున, నాలుగో అవార్డు రూ.11వేలు 11మందికి అందజేస్తారన్నారు. వివరాలకు సెల్ నంబరు 9849421462ను సంప్రదించాలని కోరారు. దరఖాస్తులను http://kreedaabharati.org/. వెబ్‌సైట్‌లో పోస్ట్ చేయాలన్నారు.

ఆయుష్ పేరుతో.. అక్రమాలు..!

- ఆయుష్ వైద్యం ముసుగులో 'వ్యాపారం'
- అనుమతిలేకుండానే ఆస్పత్రులు, షాపులు నిర్వహణ
- విజిలెన్స్ తనిఖీల్లో బట్టబయలైన అక్రమాలు
- ఇటీవల అనంతలో నాలుగు ఆస్పత్రులు, మందుల షాపుల సీజ్

"కొందరు ఆయుష్ డాక్టర్లు అక్రమదందాకు తెరలేపారు. ఆయుష్ మందులు మంచిగా పని చేస్తాయని, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవనే ప్రచారం ఎక్కువగా ఉంది. దీంతో వివిధ రోగాలతో బాధపడేవారు ఈ మందుల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే కొందరు ఆయుష్ వైద్యులు సొంతంగా ఆస్పత్రులు, మందులషాపులు ఏర్పాటు చేసుకొని 'వ్యాపారానికి' తెర తీశారు. అనుమతులు లేని ఆయుష్ మందులు అమ్ముతూ ప్రజలప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్న ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఈ అక్రమ ఆయుష్ ఆస్పత్రులు, మందులషాపుల విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. రాష్ట్ర ఆరోగ్యశాఖ కమిషనర్ ఈ ఆయుష్ షాపులను పరిశీలించి వాస్తవ నివేదికలు ఇవ్వాలని విజిలెన్స్‌శాఖను ఆదేశించారు."

- అనంతపురంటౌన్ (ఆంధ్రజ్యోతి)



సాయినగర్‌లోని ధన్వంతరి ఆయుష్ మెడికల్‌షాపు

● ప్రభుత్వ ఆయుష్ డాక్టర్ల నిర్వహణ

విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన నాలుగు ఆస్పత్రుల్లో మూడు ప్రభుత్వ ఆయుష్ డాక్టర్లే నిర్వహిస్తుండటం గమనార్హం. వీరు ప్రభుత్వ ఆయుష్ ఆస్పత్రులలో ఇతర డాక్టర్ల మాదిరి గానే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అయితే వీరి పర్యవేక్షణ వైద్యశాఖకు సంబంధం లేదంటున్నారు. డ్రగ్స్‌శాఖకు సంబంధం లేదంటున్నారు. రాయలసీమ స్థాయిలో కర్నూలులో వీరికి సంబంధించి ఇద్దరు పర్యవేక్షణ అధికారులు ఉంటారని చెబుతున్నారు. దీంతో వీరి గురించి ఎవరూ పట్టించుకోరు కాబట్టి సక్రమంగా డ్యూటీలకు వెళ్లడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే ధైర్యంగా జిల్లాకేంద్రంలో ఆయుష్ ఆస్పత్రులను పెట్టుకొని, సొమ్ము చేసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

● జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి

ఆయుష్ ఆస్పత్రులు, మందుల దుకాణాలు ప్రారంభించాలంటే తొలుత రాష్ట్రస్థాయిలో ఉన్న ఆయుష్ కమిషనర్ విభాగంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడ దరఖాస్తులను పరిశీలించి, క్షేత్రస్థాయి పరిశీలనకు పర్యవేక్షణ అధికారులను పంపుతారు. అన్నీ సక్రమంగా ఉంటే రాష్ట్ర ఆయుష్‌శాఖ కమిషనర్ నుంచి హాస్పిటల్, మందులషాపు నిర్వహణకు అనుమతులు మంజూరు అవుతాయి. ఇవన్నీ ఏమిలేకుండానే జిల్లాలో ఆయుష్ ఆస్పత్రులు, మందుల షాపులు నిర్వహిస్తున్నారు. అనంతపురంలోనే కాదు కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి ప్రాంతాలలో కూడా అనుమతులు లేకుండా ఆయుష్ ఆస్పత్రులు, మందుల షాపులు నిర్వహిస్తున్నారు. కాగా ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఇటీవల కొందరు సొంతంగా మందులు తయారుచేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఆమందులను కూడా తక్కువ ధరకే కొనుగోలు చేసి ఈఆయుష్ ఆస్పత్రుల డాక్టర్లు, మందులషాపు యజమానులు అమ్ముతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకే దాడులు

రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకే జిల్లాలో ఆయుష్ ఆస్పత్రులు, మందులషాపుల్లో తనిఖీలు నిర్వహించాం. జిల్లాకేంద్రంలో ఆరు ఆస్పత్రులు, మందుల షాపులు తనిఖీలు చేశాం. ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించాం. దీంతో ఆయా ఆస్పత్రులు, మందుల షాపులను సీజ్ చేశాం. ప్రభుత్వానికి నివేదికలు పంపాం

- నాగభూషణం, డీఎస్పీ, విజిలెన్స్

అనుమతులు మా పరిధిలో ఉండవు

ఆయుష్ మందులషాపులకు అనుమతులు ఇవ్వడం మా పరిధిలో ఉండదు. ఆయుష్ ఆస్పత్రులు, మందుల షాపుల నిర్వహణకు రాష్ట్ర ఆయుష్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడ అనుమతులు ఇచ్చిన తర్వాతనే ఇక్కడ ఆస్పత్రులు, మందులషాపులు ఏర్పాటు చేసుకొని నిర్వహించాలి. విజిలెన్స్ అధికారులతో పాటు నేనూ కూడా తనిఖీలకు వెళ్లిన సమయంలో అనుమతులు లేకుండానే ఆయుష్ మందుల షాపులు నిర్వహిస్తున్నట్లు బయటపడింది. దీంతో సీజ్ చేశాం.

- రమేష్‌రెడ్డి, డ్రగ్స్‌శాఖ అడిషనల్ డైరెక్టరు





ఆయుష్ మందులను పరిశీలిస్తున్న విజిలెన్స్, డ్రగ్స్‌శాఖ అధికారులు

నాలుగు ఆస్పత్రులు, మందుల షాపులు సీజ్

రాష్ట్రవ్యాప్తంగా గతనెల 25న అన్నిజిల్లాలో ఆయుష్ ఆస్పత్రులు, మందులషాపులపై దాడులు జరిగాయి. ఈక్రమంలోనే అనంత జిల్లాలో విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, సీఐ శ్రీనివాసులు, ఏఓ వాసుప్రకాష్, జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టరు రమేష్‌రెడ్డి బృందం తనిఖీలు నిర్వహించింది. జిల్లాకేంద్రంలోని ఆరు ఆయుష్ ఆస్పత్రులతోపాటు అక్కడే నిర్వహిస్తున్న ఆయుష్ మందుల షాపులను తనిఖీ చేశారు. ఇందులో నాలుగు ఆస్పత్రులు, మందుల షాపులు ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు బయటపడింది. జిల్లా కేంద్రంలోని కమలానగర్‌లో ఉన్న మెహతాఆయుర్వేద హాస్పిటల్, రామచంద్రనగర్‌లోని సుశ్రుత ఆయుర్వేద హాస్పిటల్, అరవిందనగర్‌లోని కేరళ అమూల్య ఆయుష్ హాస్పిటల్, సాయినగర్‌లోని ధన్వంతరి ఆయుష్ హాస్పిటల్‌తోపాటు అక్కడే నిర్వహిస్తున్న ఆయుష్ మందుల షాపులను విజిలెన్స్‌శాఖ అధికారులు సీజ్ చేశారు.

పారిశ్రామికాభివృద్ధికి చొరవ చూపండి

- ఏపీఐఐసీ ఎండీ, పరిశ్రమల శాఖ కమిషనర్ అభిషిక్త్ కిషోర్

అనంతపురం అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని ఏపీఐఐసీ ఎండీ, పరిశ్రమల శాఖ కమిషనర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశించారు. అనంత ఉమ్మడి జిల్లాలో సోమవారం ఆయన పర్యటించారు. తొలుత శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ఏపీఐఐసీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుహానా సోనీ, అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆ తర్వాత జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో పలు అంశాలపై ఆరా తీశారు. ఉమ్మడి జిల్లాలో ఏఏ రకాల పరిశ్రమలు స్థాపించారు..? ఇంకా ఏఏ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులు ఆసక్తి చూపుతున్నారన్న అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశ్రామికవాడలను మరింత అభివృద్ధి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ వివరాలను క్షేత్రస్థాయిలో ఔత్సాహికులకు తెలియజేసి, పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చేలా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుహానా సోనీ, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్, ఏడీ రాజశేఖర్‌రెడ్డి, ఐపీఓలు రవీంద్రనాథ్‌రెడ్డి, భువనేశ్వరి, నిషాంత్ తదితరులు పాల్గొన్నారు.



పరిశ్రమల శాఖ జిల్లా కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అభిషిక్త్ కిషోర్



ఎంపికైన విద్యార్థులతో నూతిమడుగు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం

నూతిమడుగు విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్రస్థాయి పోటీలకు 43మంది ఎంపిక

కళ్యాణదుర్గం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ పోటీల్లో కంబదూరు మండలం నూతిమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థులు 43 మంది అత్యంత ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో సోమవారం ఆయన పీడీలు ఓబులేసు, సంజీవరాయుడులతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. అక్టోబరు, నవంబరు నెలల్లో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో అండర్- 14, 17, 19 గేమ్స్ కేటగిరీల్లో తమ పాఠశాల విద్యార్థులు మెరుగైన ఆటతీరుతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఖోఖో, వాలీబాల్, ఆర్చరీ, హ్యాండ్ బాల్, వెయిట్ లిఫ్టింగ్ వంటి క్రీడల్లో ఈ 43 మంది విద్యార్థులు అద్భుత ప్రదర్శన చేసినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో కూడా వీరు రాణించాలని అభిలషించారు. గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పీడీలను అభినందించారు.

పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోండి

- సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి



బుక్కరాయసముద్రం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ శాస్త్రవేత్త(సేద్య విభాగం) డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో శనగలో పచ్చ పురుగు, మరూక మచ్చల పురుగు (గూడుపరుగు) ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. వర్షపు జల్లులతో కూడిన వాతావరణం లేదా మబ్బులతో కూడిన తేమ వాతావరణం ఉంటే ఈ పురుగు ఉధృతి అధికంగా ఉంటుందన్నారు. దీని నివారణకు లీటరు నీటికి ఎమామెక్టిన్ బెంజోయేట్ నోవాల్యురాన్ 1.5 ఎంఎల్, లేదా థాయోక్లోప్రిడ్ ఫ్లూబెండమైట్ 1.25 ఎంఎల్ లేదా బోంజోయోల్ 0.4 ఎంఎల్ కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. రాబోయే మూడు రోజులు మబ్బులతో కూడిన వాతావరణం ఉంటుందని, అక్కడక్కడ చిరుజల్లులు నుంచి తేలికపాటి వర్షపాత సూచన ఉందని వెల్లడించారు. రైతులు వరి కోత పనులు వాయిదా వేసుకుంటే మంచిదని సూచించారు.

పప్పుశనగ పంటకు తెగుళ్లు

తుఫాన్ ఎఫెక్ట్...



ఎండిన పప్పుశనగ మొక్క

పిచికారీ తప్పక చేసుకోవాలంటున్న వ్యవసాయాధికారులు

రైతులపై మరింత ఆర్థిక భారం

పుట్లూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలో రబీలో సాగుచేసిన పప్పుశనగ పంటకు తెగుళ్ల బెడద పీడిస్తోంది. తుఫాన్ కారణంగా వారం రోజుల క్రితం కురిసిన వర్షాలతో పంటకు అగ్గి, ఏరుకుళ్లు, ఎండు తెగుళ్లు ఉధృతంగా సోకాయి. వీటిలో ఎక్కువగా ఎండుతెగుళ్లు రైతులను ముప్పుతిప్పలు పెడుతోంది. ఎండుతెగుళ్లు సోకిన పంటలో మొక్క కింది భాగం నుంచి కాండం పైవరకు ఎండిపోతోంది. ఇలా ఆ మొక్క నుంచి మరో మొక్కకు సోకుతూ పంట మొత్తం తెగుళ్లు విస్తరిస్తోంది. పప్పుశనగ పంటలోని వంక నార్వల్లో, గుంతలు ఏర్పడినచోట ఎక్కువనీరు నిల్వ ఉండడంతో పప్పుశనగ మొక్కలు కుళ్లిపోతున్నాయి. మరికొన్నిచోట్ల నీరు ఎండిపోయినా కూడా పంటలో ఎదుగుదల కనిపించడం లేదు. మండలంలోని పుట్లూరు, శనగలగూడూరు, గాండ్లపాడు, తక్కళ్లపల్లి, వెంగన్నపల్లి, నాగిరెడ్డిపల్లి, చెర్లోపల్లి, ఎస్. కొండేపల్లి, పోతిరెడ్డిపల్లి, నారాయణరెడ్డిపల్లి, మడ్డిపల్లి తదితర గ్రామాల్లో పప్పుశనగ పంటను ఎక్కువగా సాగుచేస్తున్నారు. గతంలో కంటే ఈ ఏడాది 15,300 ఎకరాల్లో శనగపంటను సాగుచేశారు. గతేడాది రబీలో వర్షం లేక పప్పుశనగను సాగుచేయలేదు. ఈ ఏడాది మాత్రం వర్షాలు బాగా రావడంతో రైతులు పప్పుశనగ పంటను ఎక్కువ గా సాగుచేశారు. అయితే రైతులను తెగుళ్లబెడద వదలడం లేదు. సాధారణంగా పప్పుశనగ పంటను పురుగులు ఆశించడం పరిపాటే. కానీ ఈ ఏడాది మాత్రం ఎండలు సరిగా లేకపోవడంతో తెగుళ్లు ఎక్కువయ్యాయి.

ట్రాక్టర్‌తో పప్పుశనగ పంటకు పిచికారి



ఎక్కువ ఖర్చు అవుతోంది



ఈ ఏడాది సకాలంలో వర్షాలు రావడంతో 11 ఎకరాల్లో పప్పుశనగ సాగుచేశాను. ఎండుతెగుళ్లు రావడంతో వాటికి క్రిమిసంహారక మందులను పిచికారి చేయాల్సి వస్తోంది. పెట్టుబడి కన్నా ఈ ఏడాది పిచికారి మందులకే ఎక్కువ ఖర్చు చేయాల్సి వచ్చింది. తెగుళ్ల నివారణకు నెలలో రెండుసార్లు పిచికారి చేశా. పిచికారి మందులతో పాటు ట్రాక్టర్ బాడుగలు సైతం అధికమవుతున్నాయి. పెట్టిన పెట్టుబడికి దిగుబడి బాగా వస్తే గిట్టుబాటు అవుతుంది.

- గోవిందు, పప్పుశనగ రైతు, చెర్లోపల్లి

వేరు నుంచి ఎండిపోతోంది



పప్పుశనగ పంటను 12 ఎకరాల్లో సాగుచేశాను. ప్రస్తుతానికి పంట ఆశించిన స్థాయిలో ఉన్నా తెగుళ్లు మాత్రం ఎక్కువయ్యాయి. తెగుళ్లు భూమిలోని వేరు నుంచి పై కాండం వరకు కుళ్లిపోయి చివరికి ఎండిపోతోంది. ఇప్పటికే మూడు సార్లు పంటకు పిచికారి చేశాను. ఇంకా తెగుళ్లతో పాటు పూతకు, పంట ఎదుగుదలకు క్రిమిసంహారక మందులను పిచికారి చేయాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి రైతులకు పిచికారి మందులను ఎక్కువ మొత్తంలో సబ్సిడీ ద్వారా పంపిణీ చేస్తే బాగుంటుంది.

- శివశంకర్‌రెడ్డి, పప్పుశనగరైతు శనగలగూడూరు

సస్యరక్షణ చర్యలు తీసుకోండి




పప్పుశనగ పంటలో కనిపిస్తున్న ఎండుతెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. తప్పనిసరిగా క్రిమిసంహారక మందులను పిచికారిచేస్తే తెగులును నివారించవచ్చు. నీరు నిలిచిన చోట తడి ఆరిన వెంటనే శాప్ మందును పిచికారి చేస్తే ప్రయోజనం ఉంటుంది. మ్యాంకోజెబ్‌తో పాటు కార్బెండజిమ్ (శాప్)ను ఎకరానికి 400 గ్రాములు పిచికారి చేసుకోవాలి. లేకపోతే హెక్సాకొనజోల్ 400 మిలీ లేదా ప్రొపికోనజోల్ 200 మిలీ ఏదో ఒకటి మాత్రమే పిచికారి చేయాలి. పంటలో తెగులు సోకినచోట పిచికారి చేసే సమయంలో కాండం మొత్తం తడిచేలా చూసుకోవాలి.

- కాత్యాయిని, వ్యవసాయాధికారి

5న రండి..!

- యాడికి ఎంపీడీఓ కార్యాలయ అధికారులకు పిలుపు
- జడ్పీ సీఈఓ కార్యాలయానికి రావాలని ఆదేశం
- రికార్డుల మాయం నివేదికపై విచారణ

యాడికి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డుల మాయంపై సంబంధిత అధికారులు ఈనెల 5న జడ్పీ సీఈఓ కార్యాలయంలో హాజరు కావాలంటూ సీఈఓ నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఆ అధికారులు తమవద్ద ఉన్న ఆధారాలతో జడ్పీ సీఈఓ కార్యాలయంలో హాజరుకావడానికి సిద్ధమవుతున్నారు. 2019-20 నుంచి 2022-23 కాల వ్యవధికి సంబంధించి యాడికి మండల పరిషత్ నిధుల్లో సీనరేజస్ సెస్ కోట్ల రూపాయల్లో జమ అయ్యిందని, ఆ నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చుచేశారని, పనులపై విచారణ చేయాల్సిందిగా గతంలో కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ అధికారిగా గుంతకల్లు డీఎల్‌డీఓను నియమించారు. ఆ అధికారి అక్టోబరు నెలలో యాడికి ఎంపీడీఓ కార్యాలయానికి విచారించారు. ఈ విచారణకు గతంలో పనిచేసిన ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్‌డీ వెంకటేష్, పీఆర్ ఏఈలు వరప్రసాద్, ఆదినారాయణరెడ్డి, ఆంజనేయులు, దేవకుమార్ హాజరయ్యారు. మరికొందరు గైర్హాజరయ్యారు. సాధారణ నిధులకు సంబంధించిన రికార్డులు, క్యాష్‌బుక్స్, వోచర్స్, వర్క్‌లిస్ట్, మండలపరిషత్‌లో ఆమోదించిన తీర్మానాలు విచారణ సమయంలో ఇవ్వలేదు. 2019-2020లో సాధారణ నిధులకు సంబంధించిన క్యాష్‌బుక్ మాత్రమే విచారణలో చూపించినట్లు తెలిసింది. 2019-2023కు సంబంధించి రికార్డులు ఇవ్వలేదు. 2019-2023 మధ్యకాలంలో రూ.3,54,23,290 సీఎఫ్ఎంఎస్ ద్వారా ట్రాన్సక్షన్ జరిపినట్లు విచారణలో తేల్చారు. ఈఎండీ ద్వారా 2021 జూన్9న బి. రామచంద్రారెడ్డికి రూ.50వేలు, 19-06-2021న రూ.2.50లక్షలు సెల్ఫ్‌గా అదే ఏడాది జూలై 9న రూ.1.40లక్షలు, 20-01-2022న రూ.7వేలు, 19-06-2024న రూ.26వేలు డ్రా చేసుకున్నట్లు బ్యాంక్‌స్టేట్‌మెంట్‌లో గుర్తించారు. ఈఎండీ అమౌంట్‌ను కాంట్రాక్టర్ అభ్యర్థన మేరకు కాంట్రాక్టర్‌కు ఇవ్వవలసి ఉంటుంది. వీటికి సంబంధించిన రికార్డులు కూడా ఎంపీడీఓ కార్యాలయంలో లేవని తెలిపారు. రికార్డులు అందించడానికి 15రోజులు సమయం ఇచ్చినా అధికారులు ఇవ్వలేకపోయారని నివేదికలో తెలిపారు. రికార్డు లు లేనందున పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించలేకపోయామని పేర్కొన్నారు. నిధుల దుర్వినియోగం, విచారణకు రికార్డులు అందించ లేని సంబంధిత అధికారులపై సీసీఏ రూల్స్‌మేరకు చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీఓ విజయలక్ష్మి జడ్పీ సీఈఓకు నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ఆధారంగా అప్పటి ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్‌డీ వెంకటేష్‌లను ఈనెల 5న జడ్పీ సీఈఓ కార్యాలయంలో హాజరుకావాలని ఆదేశిస్తూ సీఈఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి.



రికార్డులు, ఫైల్స్‌తో సీఈఓ కార్యాలయంలో హాజరుకావాలని వచ్చిన ఆర్డర్

అసలైన వారిని తప్పిస్తున్నారా?

2019-2023 మధ్యకాలంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేసిన అధికారిని వదిలేసి ఎవరినో బాధ్యులను చేస్తూ విచారణకు హాజరుకావాలంటూ ఉత్తర్వులు ఇవ్వడంపై విమర్శలు వినవస్తున్నాయి. అప్పట్లో రెగ్యులర్ ఎంపీడీఓ ఉన్నప్పటికీ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పెత్తనం చెలాయించిన ఆ అధికారిపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నిస్తున్నారు. రెగ్యులర్ ఎంపీడీఓగా ఉన్న కొండయ్య వేతనాన్ని కూడా సీఎఫ్ఎంఎస్‌లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఉన్న అనిల్ కుమార్ మంజూరు చేయడం తెలిసిందే. రికార్డులు, ఎం.బుక్కులు చూపించాల్సిన ఆ అధికారి విచారణకు హాజరుకాలేదు. రికార్డులు అప్పగించని వైనంపై చర్యలు తీసుకోవాలని విచారణ అధికారి గుంతకల్లు డీఎల్‌డీఓ జిల్లా పరిషత్ సీఈఓకు నివేదిక ఇచ్చారు. అయితే ఆ అధికారిని విచారణకు పిలవకుండా ఇతర అధికారులను పిలవడంలో ఆంతర్యమేమిటో అని మండల పరిషత్ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. రికార్డులు మాయం చేసిన ఆ అధికారి ఒక ప్రజాప్రతినిధి సిఫార్సు ద్వారా చర్యలు తీసుకోకుండా జాగ్రత్తపడినట్లు సమాచారం.

న్యూస్‌బాక్స్

పీఏబీఆర్ కుడి కాలువకు నీటి విడుదల


నీటి విడుదలకు స్విచ్ ఆన్ చేస్తున్న డీఈ వెంకటరమణ

కూడేరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పెన్న అహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) కుడి కాలువకు ఇరిగేషన్ అధికారులు సోమవారం నీటిని విడుదల చేశారు. ఇరిగేషన్ డీఈ వెంకటరమణ స్విచ్ ఆన్ చేసి వంద క్యూసెక్కులు విడుదల చేశారు. సాయంత్రానికి 250 క్యూసెక్కులకు నీటిని పెంచుతామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 3.258 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. తుంగభద్ర డ్యాం నుంచి లింక్ చానల్ ద్వారా 258 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉందని, వాటి ఆధారంగా ఔట్ ఫ్లో పెంచుతామన్నారు. పీఏబీఆర్ కుడి కాలువ నుంచి 49 చెరువులకు నీటిని అందించేందుకు ఇరిగేషన్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. కార్యక్రమంలో డీఈ తోపాటు ఏఈలు వెంకటరమణ, ఓబుళరెడ్డి, హిమశైల పాల్గొన్నారు.

892 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 892 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 760 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీరు నిల్వ వుందని వెల్లడించారు.

క్రైంకార్నర్

ఇనుప గేటు పడి బాలుడి మృతి


మనోజ్ తేజ (ఫైల్)

కూడేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమ్మమ్మ ఇంటికొచ్చి ఆనందంగా గడుపుతున్న ఓ బాలుడిని ఇనుపగేటు రూపం లో ఆదివారం మృత్యువు వెంటాడింది. స్థానికులు తెలిపిన మేరకు మండలంలోని కల్లగళ్ల గ్రామానికి చెందిన పార్వతికి గార్లదిన్నె మండలం కేశవాపురం గ్రామానికి చెందిన గోపాల్‌తో వివాహమయ్యింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉ న్నారు. పార్వతి శుక్రవారం తన పుట్టింటింటికి కుమారుడు మనోజ్ తేజ(4), కుమార్తె మనుశ్రీతో కలిసి వచ్చింది. ఆదివారం చిన్నారులతోపాటు మనోజ్ తేజ ఆడుకుంటున్న సమయంలో ఇంటి గేటు ఊడి తలపై పడింది. తీవ్రంగా గాయపడిన బాలుడిని అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న మనోజ్ తేజ మృతిచెందడంతో తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదించారు.

గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు
- తల్లి, కుమార్తెకు గాయాలు


గాయపడిన వాణిశ్రీ

గుంతకల్లుటౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కనదొడ్డి తండాలో సోమవారం గ్యాస్ తల్లి, కూతురు గాయపడ్డారు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన ఎం రాముడు నాయక్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గత కొన్ని రోజుల నుంచి ఇంట్లో గ్యాస్ సిలిండర్ నుంచి వాసన వస్తోందన్నారు. రాముడునాయక్ భార్య వాణిశ్రీ సోమవారం గ్యాస్ పైప్ మార్చడానికి పైప్‌ను బయటకు లాగింది. దీంతో మంటలు వ్యాపించాయన్నారు. మంటల వ్యాపించడంతో వాణిశ్రీ వెంటనే తన దగ్గరే ఉన్న నాలుగేళ్ల కుమార్తె నవ్యను బయటకు తోసేసింది. ఆమె గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి వాణిశ్రీని బయటకు తీసుకువచ్చారు. గ్రామస్థులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలాన్ని చేరుకొని మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో గాయపడిన తల్లి, కుమార్తెను గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తహసీల్దారు రమాదేవి ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.


గాయపడిన నవ్య

హద్దులు చెరిపేస్తున్నారు..!

భూముల రీసర్వే పేరుతో హద్దురాళ్లు

- అప్పట్లో పాతేందుకు ఒక్కో రాయికి రూ.150 ఖర్చు
- నాటి వైసీపీ ప్రభుత్వంలో ప్రజాధనం దుర్వినియోగం
- యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు
- కూటమి పాలనలో తొలగింపు ప్రక్రియ


సర్వే రాళ్లపై బొమ్మ, పేర్లను తొలగిస్తున్న కార్మికులు

ధర్మవరం/చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామంటూ గత వైసీపీ పాలకులు చేపట్టిన సమగ్ర భూసర్వే రైతులకు కొత్త ఇబ్బందులను తెచ్చిపెట్టింది. ఈ విధానంతో చివరికి రెవెన్యూ, సర్వే అధికారులకు సైతం లేని తలనొప్పి వచ్చిపడింది. ప్రజాధనం భారీగా దుర్వినియోగం కాగా.. జగన్ బొమ్మతో ప్రచారానికి వాడుకున్నదే తప్ప.. రైతులకు ఒరిగిందేమీ లేదన్నది బహిరంగ రహస్యమే. భూవిస్తీర్ణాల్లో తేడాలు, ఎల్‌పీఎం నంబర్లతో సమస్యలు తలెత్తి, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రీసర్వేలో అవకతవకలకు పాల్పడ్డారని రైతులు గగ్గోలు పెట్టినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ సమస్యను గుర్తించిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం సమగ్ర భూసర్వేపై ప్రత్యేక దృష్టి సారించింది. రాళ్లపై జగన్ బొమ్మ, పేర్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టింది.

జగన్ బొమ్మతో రాళ్లు

రీసర్వేతో రైతులకు మేలు చేకూరిందేమీలేదు. సర్వే రాళ్లపై జగన్ బొమ్మ, పేరును గత వైసీపీ ప్రభుత్వం ముద్రించింది. దీనిని చాలామంది రైతులు వ్యతిరేకించారు. అయినా అప్పట్లో పాలకులు పట్టించుకోలేదు. రైతుల పొలాల్లో రాళ్లపై జగన్ బొమ్మ ఉండి తీరాల్సిందేనన్న ధోరణితో వ్యవహరించారు.

ఒక్కో రాయికి రూ.150 ఖర్చు

రీసర్వే చేసిన పొలాల్లో పాతిన రాళ్లపై కూడా గత ప్రభుత్వం భారీగా వెచ్చించింది. ఒక్కో రాయికి రూ.150 ఖర్చు చేసింది. రాళ్ల కొనుగోలులో అక్రమాలకు పాల్పడారన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో 461 గ్రామాలకుగాను 161 ఊర్లలో భూముల రీసర్వే పూర్తి చేశారు. మొత్తంగా 1,34,910 రాళ్లను పొలాల్లో పాతారు. ఇటీవల కొలువుదీరిన కూటమి ప్రభుత్వం సర్వేరాళ్లపై బొమ్మ, పేర్ల తుడిపివేత ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం శరవేగంగా సాగుతోంది. ఇప్పటివరకు 35వేల వరకు రాళ్లపై బొమ్మ, పేర్లు తుడిపివేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా ఈ తంతు పూర్తి చేయడానికి సర్వే, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సర్వే ద్వారా హద్దులు నిర్ణయించి, పొలాల్లో పాతేందుకు కొనుగోలు చేసిన రాళ్లు రైతుల పొలాల వద్ద, సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయ ఆవరణాల్లో వృథాగా దర్శనమిస్తున్నాయి.


చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వృథాగా పడివున్న సర్వే రాళ్లు

కూటమి ప్రభుత్వం రాగానే..

భూరీసర్వే కారణంగా రైతులు పడుతున్న అవస్థలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. అధికారంలోకి రాగానే పట్టాదారు పాసుపుస్తకాలు, సర్వే రాళ్లపై ఉన్న జగన్ బొమ్మ, పేర్లను తొలగిస్తామని హామీ ఇచ్చిన మేరకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేయడంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా పేర్ల తొలగింపు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది.

చురుగ్గా పేర్ల చెరిపివేత

జిల్లాలో సర్వే హద్దురాళ్లపై పేర్లు తొలగించే ప్రక్రియను వేగంగా చేయిస్తున్నాం. ఎప్పటికప్పుడు సిబ్బంది ద్వారా పనులను పర్యవేక్షిస్తున్నాం. ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి ఎలాంటి గడువూ లేదు.

- విజయశాంతి, ఏడీ, సర్వే భూరికార్డుల శాఖ, శ్రీసత్యసాయి జిల్లా

బిడ్డలతో మహిళ అదృశ్యం



అనంతపురం క్రైం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌కు చెందిన వెన్నెల.. నగరంలోని తన పుట్టింటికి వచ్చి అదృశ్యమయ్యారు. ఇద్దరు పిల్లలతో కలిసి ఆమె రెండు రోజుల క్రితం వెళ్లిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు త్రీటౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. కొక్కంటి క్రాస్‌కు చెందిన మనోహర్, వెన్నెల దంపతులకు ప్రదీప్, అక్షర సంతానం. గతనెల 20న వెన్నెల.. పిల్లలతో కలిసి అనంతపురం నగరంలోని ముత్యాలమ్మ కాలనీలోని పుట్టింటికి వచ్చారు.

అమాంతం పెరిగిన టమోటా ధరలు

అనంతపురం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో టమోటా ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. కొన్ని రోజులుగా కిలో గరిష్ఠ ధర రూ.30 నుంచి రూ.35 మధ్య పలుకుతూ వచ్చింది. సోమవారం కిలో పై రూ.5 పెరిగింది. కిలో గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయాయి. అలాగే సరాసరి రూ.35, కనిష్ఠ రూ.30 పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.28,400 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 8వేలు, సరాసరి రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 72టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

గౌరవం లేదు.. వేతనమూ లేదు..!

జీతాల కోసం ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీల ఎదురుచూపు

15 నెలలుగా అందని దుస్థితి



కొత్తచెరువు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ఆర్థిక విధ్వంసం సాగించారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నారు. ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులకు సమయానికి వేతనం అందింది లేదు. నెలాఖరులో ఇచ్చిన సందర్భాలు కోకొల్లలు. వేతన వెతలు ఉద్యోగులకే కాదు.. ప్రజాప్రతినిధులకూ తప్పలేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీలకు కూడా గౌరవ వేతనం 15 నెలలుగా అందలేదు. ఉమ్మడి జిల్లాలో 63 మండలాలున్నాయి. మండలానికి ఒకరు చొప్పున 63 మంది జడ్పీటీసీలు ఉన్నారు. వీరిలో ఒకరు మృతిచెందగా 62 మంది ఉన్నారు. 63 మంది ఎంపీపీలకుగాను ఇద్దరు పదవులకు రాజీనామా చేశారు. ఉమ్మడి జిల్లాలో 841 మంది ఎంపీటీసీలు ఉండగా.. ఇందులో 12 మంది మృతిచెందారు. ఇద్దరు పార్టీ మారారు. జడ్పీటీసీ, ఎంపీపీలకు గౌరవవేతనం నెలకు రూ.8 వేలు, ఎంపీటీసీలకు రూ.3 వేలు చొప్పున అందాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీ, మండల పరిషత్‌ల అభివృద్ధిని అటకెక్కించింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను సైతం దారి మళ్లించింది. దీంతో ఎంపీపీలు, ఎంపీటీసీలకు అందాల్సిన గౌరవ వేతనం కూడా నిలిచిపోయిందని వారు వాపోతున్నారు.

ఆశలపై నీళ్లు

గత వైసీపీ హయాంలో పాలకుల దౌర్జన్యాలు పరాకాష్టకు చేరాయి. పోలీసులతో కలిసి స్థానిక సంస్థల ఎన్నికలను ఏకపక్షంగా నిర్వహిస్తున్నారని తెలుగుదేశం పార్టీ పరిషత్ బహిష్కరించింది. దీనితో ఎన్నికల బరిలో వైసీపీ మాత్రమే నిలిచింది. ఉమ్మడి జిల్లాలో 90 శాతం మందికిపైగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా వైసీపీ వారే ఎన్నికయ్యారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులమనీ, నిధులు దండిగా వస్తాయనీ, మండలాలు, గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసుకోవచ్చని ఆనందపడ్డారు. వారి ఆశలపై అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లింది. పైసా కూడా నిధులు విదల్చలేదు. పైగా కేంద్రం ఇచ్చిన 15వ ఆర్థిక సంఘం ఇతరత్రా నిధులను సైతం దారి మళ్లించింది. దీంతో ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు కన్న కలలన్నీ కల్లలయ్యాయి. నిధులు, పనుల సంగతి దేవుడెరుగు, చివరకు గౌరవ వేతనం కూడా దక్కలేదు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం ద్వారానైనా సమాజంలో గౌరవం పొందవచ్చనుకున్నారు. ఆ అవకాశం కూడా ఇవ్వలేదు నాటి ప్రభుత్వం. వార్డు, గ్రామ వలంటీర్ల ద్వారా పథకాలను ప్రజలకు అందజేశారు. దీంతో గౌరవం, గౌరవ వేతనం రెండూ లేకుండా పోయాయని వారు వాపోతున్నారు.

ఆఫీసులకు రాం.. రాం..

రాష్ట్రంలో పాలకపక్షం మారడంతో చాలా మండలాల్లో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రభుత్వ కార్యాలయాలకు రావడమే తగ్గించేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావడంలేదని తెలుస్తోంది. ఆ దరిదాపుల్లోకే వారు రావట్లేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పల్లెల్లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పుడైనా గౌరవ వేతనం అందుతుందా అని స్థానిక సంస్థల ప్రతినిధులు ఆశగా చూస్తున్నట్లు తెలుస్తోంది.

త్వరలోనే ఖాతాలకు జమవుతుంది

ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీలకు గౌరవ వేతనానికి సంబంధించి ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి వరకు వేతనం మంజూరు చేసింది. బిల్లు పెట్టాం. త్వరలోనే వారి ఖాతాలకు జమవుతుంది. ఇంకా.. పది నెలల గౌరవ వేతనం ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సి ఉంటుంది.

-వెంకటసుబ్బయ్య, జడ్పీ సీఈఓ

ఆమె బాగుంటేనే..
- కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): 'ఆమె బాగుంటేనే మనమంతా బాగుంటాం. మహిళలు, బాలికలను సంరక్షించడం నవ సమాజ నిర్మాణానికి పునాది' అని కలెక్టరు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో మహిళలపై హింస వ్యతిరేక అంతర్జాతీయ పక్షోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ మహిళలు, బాలికలపై హింస జరగ కుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఆచట్టాలను పక్కాగా అమలు చేసేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. మహిళలు, బాలికల ప్రాధాన్యం ప్రజలకు తెలియజేస్తూ వారిని గౌరవించేలా చైతన్యం తీసుకురావాలన్నారు. మహిళలపై హింసలేని జిల్లాగా అనంతను మారుద్దామని కలెక్టరు పిలుపునిచ్చారు. అనంతరం అధికారులతో ప్రతిజ్ఞ చేయించి, సంతకాలు చేయించారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, డీఆర్‌ఓ మలోల, ఐసీడీఎస్‌పీడీ శ్రీదేవి, బీసీ సంక్షేశాఖాధికారి కుష్బూకొఠారి వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మతో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ భరత్ మృతికి సంతాపం

మూడురోజుల కిందట మృతి చెందిన తహసీల్దార్ భరత్‌కు కలెక్టరేట్‌లో సోమవారం సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి కలెక్టరు, జేసీ, డీఆర్‌ఓ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడుతూ భరత్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సార్..! మా డబ్బులు ఇప్పించండి

అప్పుగా తీసుకుని ఇవ్వకుండా బెదిరిస్తున్నారు
ఎస్పీకి బాధితుల ఫిర్యాదు


ఎస్పీని కలిసి బయటకు వస్తున్న బాధితులు

అనంతపురం క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వడ్డీకి ఆశపడి ఓ కుటుంబానికి కొంతమంది రూ.లక్షల్లో డబ్బులు అప్పుగా ఇచ్చారు. అలా అందరూ కలిపి రూ.కోట్లు ముట్టజెప్పారు. ఆ తండ్రీ కొడుకులేమో మూడేళ్లుగా అసలు, వడ్డీ కట్టకుండా బెదిరింపులకు దిగుతున్నారని బాధితులందరూ జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ జగదీ‌ష్‌ను కలిసి సమస్యను విన్నవించుకున్నారు. అనంతరం వారు విలేకరులతో ఆవేదన వెలిబుచ్చారు. నగరంలోని రెండో రోడ్డుకు చెందిన హోసూరు మల్లికార్జున, అతడి భార్య రాజేశ్వరి, హోసూరు రాఘవేంద్ర, అతడి భార్య మంజుల ఇంటి నిర్మాణం, స్థిరాస్తుల అభివృద్ధి, కుటుంబ అవసరాల కోసం తమతో డబ్బు అప్పుగా తీసుకున్నారన్నారు. రూ.లక్ష మొదలుకొని రూ.10లక్షల వరకు ఇచ్చామన్నారు. మూడేళ్లయినా వడ్డీ కట్టలేదన్నారు. అసలు వడ్డీ కలిపి రూ.8కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. అందరం నిలదీయడంతో ఆర్థిక ఇబ్బందులతో చెల్లించలేమని రూ.4.5 ఆస్తి ఉందని, మీరే ఎవరినైనా కొనుగోలుదారుని పిలుచుకొస్తే విక్రయిస్తామని ఒప్పుకున్నారన్నారు. ఎవరినైనా తీసుకెళ్తే అసభ్య పదజాలంతో దూషిస్తూ, బెదిరించడంతోపాటు దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. రాఘవేంద్ర ఎవరెవరి పేర్లో చెప్పి బెదిరిస్తున్నాడన్నారు. కనీసం అసలైనా ఇవ్వమంటున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఎస్పీని కలిసిన వారిలో పార్థసారథి, బాషా, బయపరెడ్డి, నారాయణస్వామి, రవిచంద్ర, రామాంజినమ్మ, లక్ష్మీదేవి ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


రైతు నాగరాజు (ఫైల్)

గార్లదిన్నె, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో అప్పుల బాధ తాళలేక రైతు నాగరాజు (28) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన తిరుపాల్, సుంకమ్మ దంపతులు కుమారుడు నాగరాజు వ్యవసాయ పనులు చేసుకుంటు తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేవాడు. పంటల సాగుకోసం చేసిన అప్పులు అధికం కావడంతో వారికున్న నాలుగు ఎకరాల పొలంలో మూడెకరాలను గతంలోనే అమ్ముకున్నారు. ఉన్న ఎకరా పొలంలో చీనీచెట్లు సాగుచేసుకుని జీవనం సాగించేవారు. నాగరాజు పొలం పనులతో పాటు ట్రాక్టర్ కొనుగోలు చేసి గ్రామంలో అద్దెకు తిప్పేవాడు. పంట దిగుబడి రాక, వచ్చినా పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయారు. దీంతో అప్పులు సుమారు రూ.15 లక్షల వరకు పెరిగాయి. అప్పులు ఎలా తీర్చేదంటూ తరచూ మథనపడేవాడు. ఈక్రమంలోనే తీవ్ర మనస్తాపంతో సోమవారం తెల్లవారుజామున తోట వద్దకి వెళ్లి అక్కడే చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఉదయం గమనించిన చుట్టుపక్క పొలాల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులతో అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ఆగిన క్లాప్ వాహనాలు

సార్.. జీతాలివ్వండి

తొమ్మిది నెలలుగా బకాయిలు
ఇబ్బంది పడుతున్న క్లాప్ డ్రైవర్లు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దాదాపు తొమ్మిది నెలల నుంచి వేతనాలు రాక క్లాప్ వాహన డ్రైవర్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నవంబరు 1నుంచి క్లాప్ వాహనా లను డ్రైవర్లు నిలిపివేశారు. వైసీపీ ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్, జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా చెత్త సేకరణ కోసం క్లాప్ వాహనాలను తీసుకువచ్చింది. ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించడానికి 2022 మార్చిలో ప్రభుత్వం క్లాప్ వాహనాలను ప్రవేశపెట్టింది. రాయలసీమలో జోన్-3, 4 కింద 650 వాహనాలు మంజూరు చేశారు. ఈ వాహనాలకు డ్రైవర్లు, మెకానిక్, సూపర్‌వైజర్లను నియమించింది. పట్టణానికి 26 క్లాప్ వాహనాలు కేటాయించారు. ఒక్కో వాహన డ్రైవర్‌కు రూ.18,500లు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి విధుల్లోకి తీసుకున్నారు. అయితే వారికి ప్రస్తుతం రూ. 12లు మాత్రమే చెల్లిస్తున్నారు. మిగిలిన సొమ్ము, పీఎఫ్, ఈఎస్ఐను జీతంలో కట్ చేయడం లేదు. ప్రస్తుతం తొమ్మిది నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. డ్రైవర్లు తమకు రావాల్సిన వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి వాటి గురించి ప్రశ్నిస్తే 15 మందిని ఉద్యోగాల నుంచి తొలగించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో తమకు వేతన బకాయిలు వస్తాయని క్లాప్ డ్రైవర్లు ఎదురుచూస్తున్నారు. క్లాప్ డ్రైవర్లకు వేతనాలు చెల్లించాలని కౌన్సిల్ సమావేశంలో కమిషనర్, చైర్‌పర్సన్ దృష్టికి కౌన్సిలర్లు కూడా తీసుకెళ్లారు. ఈవిషయమై మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను వివరణ కోరగా ఏజెన్సీకి రూ.17లక్షలు, రూ.20లక్షలు చెల్లించాము. క్లాప్ డ్రైవర్లకు జీతాలు ఇచ్చేందుకు మాకు అధికారంలేదు. ఆడిట్ వాళ్లు అభ్యంతరం చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు.

జేఎన్‌టీయూకి స్నేహితుల సాయం

పేద విద్యార్థుల ఉపకార వేతనానికి రూ.5లక్షలు


ఇన్‌చార్జి వీసీకి చెక్కులను అందజేస్తున్న శ్రీరామచంద్ర

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థి శ్రీరామచంద్ర, ఆయన స్నేహితుడు విజయ భాస్కర్ ఉదారత చాటుకున్నారు. జేఎన్‌టీయూ పేద విద్యార్థులకు ఉపకార వేతనం అందించేందుకు రూ.5 లక్షలు అందజేశారు. శ్రీరామచంద్ర జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో 1970లో మెకానికల్ ఇంజనీరింగ్ చదివారు. హైదరాబాద్‌లోని హెచ్ఎంటీలో ఉన్నత హోదాలో సేవలందించి రిటైర్ అయ్యారు. విజయభాస్కర్ వరంగల్ ఎన్ఐటీలో చదివి, హైదరాబాద్ హెచ్ఎంటీలో అసిస్టెంట్ మేనేజర్ హోదాలో రిటైర్ అయ్యారు. ఈ క్రమంలో తాను చదివిన జేఎన్‌టీయూకి సాయపడాలని అనుకుంటున్నాని శ్రీరామచంద్ర తన స్నేహితుడికి తెలిపాడు. రూ.2 లక్షలు ఇస్తానని చెప్పడంతో.. విజయ భాస్కర్ సైతం తానూ రూ.3 లక్షలు ఇస్తానని ముందుకొచ్చారు. ఈ మొత్తాలను చెక్కుల రూపంలో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావుకు సోమవారం శ్రీరామచంద్ర అందజేశారు. రూ.5 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని, దానిపై వడ్డీని ఆర్థికంగా వెనుకబడ్డ విద్యార్థులకు ఏటా స్కాలర్‌షిప్‌గా అందజేస్తామని ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి తెలిపారు. కార్యక్రమలో శ్రీరామచంద్ర దంపతులు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య డైరెక్టర్ సుజాత, రిటైర్డ్ ప్రొఫెసర్ శంకర్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో గొంతు కోసుకున్న డ్రైవర్


బోయ నరసింహులు

గోరంట్ల, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరుమాళ్లపల్లికి చెందిన డ్రైవర్ బోయ నరసింహులు అనారోగ్యంతో మనస్తాపం చెంది సోమవారం గొంతుకోసుకుని, తీవ్రంగా గాయపడ్డాడు. చౌడప్ప కుమారుడైన నరసింహులుకు ఆదివారం వాంతులు కావడంతో చికత్స చేయించారు. ఈ నేపథ్యంలో మనస్తాపం చెంది సోమవారం ఉదయం ఇంట్లోనే కొడవలితో గొంతు కోసుకుని, అస్వస్థతకు లోనయ్యాడు. వెంటనే అతడిని 108 వాహనంలో గోరంట్ల ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు చికిత్స చేస్తుండగా నరసింహులు అరుస్తూ వింతగా ప్రవర్తించాడు. ఆరునెలల క్రితం కూడా ఇలాగే గొంతు కోసుకోవడానికి ప్రయత్నించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. నరసింహులు మానసిక స్థితి సరిగా లేదనీ, మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు.

సంక్షిప్తం

విభాగాలను తనిఖీ చేసిన వీసీ


ప్రొఫెసర్ మునినారాయణప్పతో చర్చిస్తున్న వీసీ

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ అనిత సోమవారం వర్సిటీలో పలు విభాగాలను తనిఖీ చేశారు. ఐక్యూఏసీ విభాగాన్ని సందర్శించి విభాగ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ముని నారాయణప్పతో మాట్లాడారు. నివేదికల ఆధారంగా న్యాక్ వంటి జాతీయ సంస్థల గుర్తింపు లభిస్తుందన్న అంశాన్ని మరచిపోరాదని సూచించారు. అనంతరం సోషియాలజీ, హిస్టరీ, సోషల్‌వర్క్ డిపార్ట్‌మెంట్స్‌కెళ్లి అటెండెంట్స్‌ను పరిశీలించారు. వేళకు విధులకు హాజరు కాకుంటే ఆప్సెంట్ వేయాలని అధికారులకు తెలిపారు. ప్రతి ఉద్యోగి బాధ్యతగా పనిచేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పలువురికి ఉద్యోగోన్నతులు

ఎస్కేయూలోని పలువిభాగాల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించారు. ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత ఆదేశాల మేరకు మొత్తం 15మందికి రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు ఉత్తర్వులు జారీచేశారు. కాగా ఉద్యోగోన్నతుల విషయంలో తనకు అన్యాయం జరుగుతోందంటూ లక్ష్మీనారాయణ గురువారం ఆత్మహత్యకు యత్నించిన విషయం విదితమే. ఎందుకు అలా చేయాల్సి వచ్చిందో సమాధానం ఇవ్వాలంటూ మెమో ఆయనకు జారీ చేశారు.

డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు డిబార్

ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు డిబార్ అయినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ తెలిపారు. ఈనెల 18నుంచి 28వరకు ప్రథమ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మెగా సప్లిమెంటరీ పరీక్షల విద్యార్థులకు కలిపి పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

పెన్షన్లు ఇవ్వాలని వినతి

రెండు నెలల పెన్షన్లు ఇంకా రాలేదని వాటిని చెల్లించాలంటూ రిటైర్డ్ ప్రొఫెసర్లు, ఉద్యోగులు సోమవారం రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబును కలిసి కోరారు. నెల నెల ఇవ్వాల్సిన పెన్షన్లు గత ప్రభుత్వంలో మూడు, నాలుగు నెలలకు చెల్లించేవారని గుర్తుచేశారు. రిజిస్ట్రార్‌ను కలిసినవారిలో సూర్యనారాయణ, ఇందిర, తిమ్మప్ప, సాయిప్రసాద్, శ్రీనివాసులు, ఓబులేసు తదితరులున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్ల మరమ్మతులో భాగంగా మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ డి-4సెక్షన్ ఏఈఈ మహేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు హౌసింగ్‌బోర్డు, హరిహర నగర్, అశోక్‌నగర్, విద్యుత్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆసుపత్రికెళ్లి పింఛన్ పంపిణీ


పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం మండలం గూనిపల్లికి చెందిన పింఛన్‌దారుడు ఇబ్రహీం బాషా అనారోగ్యం కారణంగా బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా ఉన్న ఎస్ భూషణ్‌కుమార్ తన సొంత ఖర్చులతో అక్కడి వెళ్లి పింఛన్ అందజేశారు. దీంతో పింఛన్‌దారుడు సీఎం చంద్రబాబుకు, అధికారులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్ భూషణ్‌కుమార్‌ను శ్రీసత్యసాయి జిల్లా డీఆర్‌డీఏ-వెలుగు పీడీ నరసయ్య ప్రత్యేకంగా అభినందించారు.

తూంచెర్లలో పశువైద్యశిబిరం

కనగానపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూంచెర్ల గ్రామంలో పశువైద్యాధికారులు సుధాకర్, సునీల్‌కుమార్, ప్రియదర్శిని సోమవారం ప్రత్యేక గర్భకోశ చికిత్సా శిబిరం నిర్వహించారు. పశువులలో చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్సలందించారు. పెయ్యదూడల పుట్టుకకు ప్రభుత్వం ఉచితంగా సూదులు, మందులు అందిస్తోందని తెలిపారు. అనంతరం నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. గోపాల మిత్రలు, ఏహెచ్ఏలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

నార్పల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిమిదొడ్డి గ్రామంలో గత నెల 8న రామాంజినేయులు(35)అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం విదితమే. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు రామాంజినేయులు దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నందనే ఆత్మహత్యకు యత్నించాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాగర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దుమ్ము.. ధూళికి చెక్..!

● ప్రయాణ కష్టాల నుంచి విముక్తి
● జోరుగా రుద్రంపేట-ఆలమూరు రోడ్డు నిర్మాణ పనులు

అనంతపురం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రుద్రంపేట ప్రధాన రహదారిపై ప్రయాణమంటే ప్రజలు హడలిపోయేవారు. రోడ్డు చాలా అధ్వానంగా ఉండేది. గుంతలతో పాటు రోడ్డుపై రేగే దుమ్ము..ధూళితో స్థానికులు, వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం. వర్షం కాలంలో మరింత ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇటీవల రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమై, జోరుగా సాగుతున్నాయి. మరికొన్ని రోజుల్లో స్థానికులకు, వాహనదారులకు దుమ్ము ధూళి నుంచి విముక్తి కలుగనుంది.


చంద్రబాబు కొట్టాల సమీపంలో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులు

తీరనున్న ప్రయాణ కష్టాలు

మూడేళ్ల కిందట అప్పటి వైసీపీ ప్రభుత్వంలో రుద్రంపేట సర్కిల్ నుంచి పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అది నుంచి నత్తనడక సాగుతూ వచ్చాయి. రుద్రం పేట సర్కిల్ నుంచి రెండు వందల మీటర్ల రోడ్డు దాదాపు 80 శాతం పూర్తయింది. అక్కడి నుంచి పీవీకేకే కళాశాల వరకు పనులు నత్తనడకన సాగాయి. ఏడాదిన్నర నుంచి పూర్తిగా నిలిచిపోయాయి. గుంతల మయం కావడంతో పాటు రోడ్డుపై చెలరేగే దుమ్ము, ధూళితో ప్రయాణం నరకప్రాయంగా మారింది. వర్షం వచ్చిందంటే ఏ గుంతలో పడాల్సి వస్తోందోన్న భయంతో ప్రయాణం సాగించేవారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారుల ఇబ్బందులు వర్ణనాతీతం. మూడేళ్ల పాటు దుమ్ము,ధూళితో సహజీవనం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ప్రజాప్రతినిధులు రోడ్డు నిర్మాణం దృష్టి సాధించారు. పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే పీవీకేకే కళాశాల నుంచి చంద్రబాబు కొట్టాలకు వెళ్లే దారి వరకు బీటీ రోడ్డు పనులు చాలా వరకు పూర్తయ్యాయి. మరికొన్ని రోజుల్లో వాహనదారుల రాకపోకలు సాఫీగా జరిగిపోనున్నాయి. రోడ్డు నిర్మాణ పనులు తిరిగి ప్రారంభం కావడం స్థానికులు, వాహనదారులు సంతోషాన్ని వ్యక్త పరుస్తున్నారు.

దుమ్ము, ధూళితో ఇబ్బంది పడ్డాం



రోడ్డు నిర్మాణ పనులు నిలిచి పోవడంతో గత కొంత కాలంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. వాహనాల రద్దీతో నిత్యం రోడ్డుపై చెల రేగే దుమ్ము, ధూళి మొత్తం షాపుల్లోకి వచ్చేది. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పను లు జరుగుతున్నాయి. దీంతో ప్రస్తుతం కొంత సమస్య తీరింది. రోడ్డు పూర్తి అయితే దుమ్ము,ధూళి నుంచి పూర్తిగా బయటపడినట్లవుతుంది.

- శ్రీనివాసులు,
సెలూన్ షాపు నిర్వాహకుడు, చంద్రబాబు కొట్టాల

ప్రయాణ కష్టాలు తీరినట్లే



రోడ్డు నిర్మాణం ఆగిపోవడంతో ప్రయాణికులు, స్థానికులు చాలా ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై ప్రయాణమంటే నరకం తలపించేది. టీడీపీ అధికారం చేపట్టిన తరువాత రోడ్డు నిర్మాణ పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. వేగవంతంగా సాగుతున్నాయి. మరికొన్ని రోజుల్లో నాతో పాటు, రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు, రోడ్డు పక్కల ఉన్న స్థానికులకు రోడ్డు కష్టాలు పూర్తిగా తొలగిపోతాయి.

- ఈడిగ నాగభూషణం,
టీడీపీ నాయకుడు, రుద్రంపేట

ఎమ్మెల్యే చొరవతోనే పనులు



రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయి సంవత్సరానికి పైగా అయింది. కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ ప్రారంభం అయ్యాయి. రోడ్డు నిర్మాణ పనులు తిరిగి మొదలయ్యాయంటే ముఖ్యంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కృషి చాలా ఉంది. ఆయన రోడ్డు నిర్మాణంపై ప్రత్యేక చొరవ తీసుకుని.. కాంట్రాక్టరుతో మాట్లాడి పనులు మొదలు పెట్టించారు. త్వరలో పూర్తి కానున్నాయి.

- భక్తవత్సల నాయుడు,
టీడీపీ ఇన్‌చార్జ్, రుద్రంపేట పంచాయతీ

ఎమ్మెల్యే బిజీబిజీ


వెంకటాపురంలో కలశాల ఊరేగింపు

రామగిరి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఎమ్మెల్యే పరిటాల సునీత సోమవారం బిజీబిజీగా గడిపారు. వెంకటాపురంలో కురుబలు నిర్వహించిన భక్త కనకదాస జయంతి వేడుకల ప్రదర్శనలో ఆమె పాల్గొన్నారు. కనకదాస చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. గ్రామంలోని కురుబల 36 కుటుంబాలకు కంబళ్లు పంపిణీ చేశారు. గ్రామంలోని యల్లమ్మ దేవతను దర్శించుకుని పూజలుచేశారు.

అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు: పోస్టాఫీసులో ఖాతా ఉంటేనే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వర్తిస్తాయంటూ జరుగుతున్న ప్రచారంపై ఎమ్మెల్యే పరిటాలసునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి ఆదేశాలు లేవన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు, పోస్టాఫీసు ఖాతాలకు ఏ మాత్రం సంబంధం లేదన్నారు.

సభ్యత్వ నమోదులో వేగం పెంచాలి: టీడీపీ సభ్యత్వ నమోదులో మరింత వేగం పెంచాలని పరిటాలసునీత నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఆమె సోమవారం కొత్తగాది కుంట గ్రామంలో చేపట్టిన టీడీపీ సభ్యత్వనమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే కొత్తదాగికుంటలో రూ.56లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్ల పనులను ఆమె పరిశీలించారు. ఆమె వెంట టీడీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై ఆరా

రాప్తాడు నియోజకవర్గంలోని పలు గ్రామాల సమస్యలపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆరాతీశారు. వెంటాపురానికి సోమవారం వచ్చిన వారందరితో సమావేశమై గ్రామాల్లో మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మంజూరైన సీసీ రోడ్ల పనులు పూర్తి అయ్యాయా అని విచారించారు. అదేవిధంగా నసన కోట ఎంబీజీ పాఠశాల ప్రిన్సిపాల్ హమీనాబేగం, రామగిరి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామేశ్వరి వేర్వేరుగా ఎమ్మెల్యేని కలిసి ఈనెల 7న జరిగే తల్లిదండ్రుల సమావేశానికి హాజరు కావాలని కోరారు. పేరూరులో కనకదాస విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని గ్రామానికి చెందిన కురుబ కులస్థులు ఎమ్మెల్యే పరిటాలసునీతకు విజ్ఞప్తిచేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.


అనంత బస్టాండు అభివృద్ధికి తోడ్పడండి

● ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు


సమావేశంలో పాల్గొన్న పూల నాగరాజు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఆర్ఎం కార్యాలయ భవనం నిర్మాణంతోపాటు అనంత బస్టాండు అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూలనాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడలోని ఆర్టీసీ బస్‌భవన్‌లో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో నిర్వహించిన సమీక్షలో అనంతపురం రీజియన్ నుంచి పూల నాగరాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, అప్పలనాయుడు, దొన్నుదొర, సురేష్ రెడ్డి, ఆర్టీసీ ఈడీ పాల్గొన్నారు.

జిల్లా ట్రెజరీ కార్యాలయం తనిఖీ


రాష్ట్ర డైరెక్టరును కలిసిన ఎన్జీఓ నాయకులు

అనంతపురం టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అనంత జిల్లా ట్రెజరీ కార్యాలయాన్ని ఆశాఖ రాష్ట్ర డైరెక్టరు మోహన్‌రావు తనిఖీ చేశారు. ఆయన సోమవారం అనంత జిల్లాకు వచ్చారు. జిల్లా ట్రెజరీ కార్యాలయం చేరుకొని జిల్లా ట్రెజరీ డీడీ విజయసరళకుమారితో కలిసి జిల్లాలోని సబ్‌ట్రెజరీలు, పెండింగ్ బిల్లులు, సిబ్బంది స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ట్రెజరీ స్ట్రాంగ్‌రూమ్, కార్యాలయాన్ని పరిశీలించారు.

ఉద్యోగుల పెండింగ్ బిల్లులు క్లియర్ చేయండి

ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి అనేక రకాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే క్లియర్ చేయాలని ఎన్జీఓ నాయకులు.. ట్రెజరీ శాఖ రాష్ట్ర డైరెక్టరును కోరారు. సోమవారం ఆయనను ఎన్జీఓ నాయకులు చంద్రశేఖరరెడ్డి, చంద్రమోహన్, ప్రవీణ్‌కుమార్, మహేశ్వరరెడ్డి, శంకర్ తదితరులు కలిశారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని వినతి

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పలువు పెన్షనర్లు ట్రెజరీ డైరెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లాకొచ్చిన డైరెక్టర్ మోహన్‌రావును జిల్లా ట్రెజరీ కార్యాలయంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ, గౌరవ సలహాదారుడు గోవిందరాజులు, కోశాధికారి రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్ తదితరులు కలిసి విన్నవించారు.

ఇసుక టిప్పర్ సీజ్

శింగనమల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేశారు. సోమవారం తెల్లవారుజామున నాయనపల్లి క్రాస్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను ఎస్ఐ సీజ్ చేసి శింగనమల పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నాణ్యతలేని తినుబండారాలు విక్రయిస్తే చర్యలు: ఎస్పీ

అనంతపురం క్రైం,డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్కూల్ పిల్లలకు సంబంధించి నాణ్యత లేని తినుబండారాలు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. పాతూరు పరిధిలోని స్కూళ్ల వద్ద నాణ్యతలేని తినుబండారలు విక్రస్తున్నట్లు ఎస్పీకి ఫిర్యాదు అందడంతో ఎస్పీ స్పందించారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు, వన్‌టౌన్ పోలీసులను క్షేత్రస్థాయిలోకి దింపి దాడులు చేయించారు.

అదానీ అక్రమాలపై ప్రధాని స్పందించాలి

● యువజన కాంగ్రెస్ నాయకుల డిమాండ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): దేశంలో అదానీ అక్రమాలపై ప్రధాని నరేంద్రమోదీ స్పందించాలని యూత్‌కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. చట్టాలకు అనుగుణంగా విచారణ చేపట్టి నిగ్గుతేల్చాలన్నారు. ఆల్ ఇండియా యువజన కాంగ్రెస్ సెక్రటరీ, ఏపీ ఇన్‌చార్జ్ మమతనాగిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రామారావు సోమవారం జిల్లాకు వచ్చారు. జిల్లా అధ్యక్షుడు మదుసూధన్‌రెడ్డి, మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, అనంతపురం పార్లమెంట్ ఇన్‌చార్జి దాదాగాంధీతో కలిసి పార్టీ స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రధాని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేకుండా యువతను నట్టేట ముంచుతున్నారని విమర్శించారు. దేశ సంపదను అదానీ చేతులో పెట్టి, దేశాన్ని దివాల దిశగా తీసుకెళ్తున్నారని అన్నారు. రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలన్నారు. కేంద్రంలో బీజేపీ అక్రమాలపై యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోరాటం చేపడతామన్నారు. యువజన కాంగ్రెస్ నగరాధ్యక్షుడు మూర్తి, కాంగ్రెస్ నాయకులు హరిరాయల్, ఇమామ్, కిశోర్‌రెడ్డి, ఉదీఫ్‌సింగ్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు లేకపోతే వలసలే..!

శింగనమల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడా ఉపాధి పనులు కల్పించలేకపోవడంతో కూలీలు వలసలు పోయి ప్రాణలు పోకుట్టుకుంటున్నారని సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్ అన్నారు. ఎక్కడా కూలీలకు ఉపాధి పనులు కల్పించడంలేదని సోమవారం శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఏపీఓ శ్రీదేవి మాట్లాడుతూ గ్రామాల్లో కూలీలు అడిగిన వెంటనే పనులు కల్పించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

సీపీఐ నాయకుల డిమాండ్



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

అనంతపురం విద్య, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రూరల్‌మండలంలోని ఉప్పరపల్లి పొలంలో పేదలకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పేదలతో కలిసి సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ...రూరల్‌లోని ఉప్పరపల్లి పొలం సర్వే నెంబర్ 194-8లో సుమారు 250 మంది వరకూ కొన్నేళ్లుగా గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారన్నారు. ఇది వంక పోరంబోకు కాదని గ్రామకంఠం భూమి అన్నారు. ఈ సర్వేనెంబర్‌లోని పేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చి, ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఆర్డీఓ కేశవనాయుడికి వినతిపత్రం అందించారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి రమణ, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సంతోష్‌కుమార్, నగర సహాయ కార్యదర్శి అల్లిపీరా, ఇతర నాయకులు ఖాజా హుస్సేన్, జయలక్ష్మి, వరలక్ష్మి, కృష్ణుడు, రాజు, సుందర్‌రాజు, జిలాన్‌భాష, మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి రోడ్లు వేయిస్తాం

రాప్తాడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతి గ్రామానికి ఎమ్మెల్యే పరిటాల రోడ్లు వేయిస్తారని టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి తెలిపారు. మండలంలోని బొమ్మేపర్తి గ్రామం నుంచి గొందిరెడ్డిపల్లి వరకు మట్టిరోడ్డు నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు కావడంతో ఆయన సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఈ దారిలో రాకపోకలు సాగించడానికి రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారంలోకి రావడంతో వెంటనే నిధులు మంజూరు చేయించారన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న ఎమ్మెల్యే



శింగనమల, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఆమె సోమవారం ఆన్‌లైన్ ద్వారా రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటిన మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలో శాశ్వత సభ్యత్వం తీసుకోవడం గర్వంగా ఉందన్నారు.

తాడిపత్రి, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలకు ప్రశంసలు


తాడిపత్రి, కళ్యాణదుర్గం కమిషనర్లకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీలో తాడిపత్రి, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలకు ప్రశంసలు దక్కాయి. మొదటి రోజు నవంబరు 30వ తేదీన తాడిపత్రి మున్సిపాలిటీలో 98.29శాతం పూర్తి చేసి మొదటి స్థానంలో నిలిపిన కమిషనర్ శివరామకృష్ణ, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో 97.49 శాతం పూర్తి చేసి ద్వితీయ స్థానంలో నిలిపిన కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్‌ను సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రశంసించారు. స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రంతో పాటు శాలువాతో సత్కరించారు. అదేవిధంగా తాడిపత్రి మున్సిపాలిటీలోని రెడ్డివారిపాళ్యం వార్డు రెవెన్యూ సెక్రటరీ హుస్సేన్‌పీరా 100శాతం, బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ వీఆర్‌ఓ యుగంధర్ ఉదయం 6.30లోపు 50శాతం పింఛన్లు పంపిణీ చేసినందుకు ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపి ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి అభినందనలు అందుకోవడం శుభపరిణామమని కలెక్టర్ పేర్కొన్నారు. డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, పింఛన్‌ల ఇన్‌చార్జి అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర్లకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

● ఉమ్మడి అనంత జిల్లా అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్


మాట్లాడుతున్న కుంచెపు వెంకటేష్

అనంతపురం అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వడ్డెర్లకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించాలని వడ్డెర్ల సంఘం ఉమ్మడి అనంత జిల్లా అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం స్థానిక శ్రీనివాస్‌నగర్‌లోని వడ్డెర్ల సంఘం కార్యాలయంలో వడ్డెర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళితో కలిసి మీడియాతో మాట్లాడారు. వడ్డెర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు నాయకులు, వడ్డెర్లందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పర్యటించి, మండలాల వారిగా నూతన కమిటీలు ఏర్పాటు చేస్తానన్నారు. వడ్డెర్ల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. వడ్డెర్లకు రాజకీయంగా కల్పించాలన్నారు. వడ్డెర్ల సంఘం నాయకులు మల్లికార్జున, సుధాకర్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు. కుంచెపు వెంకటేష్‌కు పలువురు టీడీపీ నాయకులు సోమవారం శుభాకాంక్షలు తెలిపారు.

మందకృష్ణను విమర్శించడం సిగ్గుచేటు

● ఎంఈఎఫ్ నాయకుడు బండారు శంకర్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు2 ఆంధ్రజ్యోతి : హైదరాబాదులోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన మాలల సింహగర్జనలో మాజీ ఎమ్మెల్యేలు, మాల నేతలు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను విమర్శించడం సిగ్గుచేటని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్ మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఆ సంఘం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాలల సింహగర్జన అని సభ పెట్టుకొని మాలలకు జరుగుతున్న అన్యాయాలపై మాట్లాడకుండా కేవలం మందకృష్ణ మాదిగను టార్గెట్ చేసి విమర్శించడం సమంజసం కాదన్నారు. ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు మన్నెపాకుల రమేష్, ఉపాధ్యక్షులు బండారు నాగేంద్ర, శ్రీనివాసులు, నగర అధ్యక్షుడు మీసాల నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురంరూరల్: సమాజంలో దళితులకు సమాన అవకాశాలు రావాలని పోరాటం చేస్తున్న మందకృష్ణ మాదిగను కించపరిచేవిధంగా మాట్లాడటం మాల మహానాడు నాయకులకు సరికాదని ఏపీ ఎమ్మార్పీఎస్ బీసీఆర్ దాస్ అన్నారు. మండలంలోని కురుగుంట గ్రామంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. షెడ్యూల్ కులాలకు సమాన అవకాశాల కోసం చేస్తున్న పోరాటానికి అందరూ మద్ధతుగా నిలవాలన్నారు.

జూడో పోటీల్లో మామిళ్లపల్లి విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కనగానపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జూడో పోటీల్లో మామిళ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆదివారం జోనల్‌స్థాయి జూడో పోటీలు నార్పలలో జరిగాయి. ఇందులో పాల్గొన్న మామిళ్లపల్లి విద్యార్థుల్లో ఒకరికి గోల్డ్, తొమ్మిది మందికి సిల్వర్ మెడల్స్ వచ్చినట్లు పీఈటీ శివా రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

పారా క్రీడా పోటీలు


త్రోబాల్ వేస్తున్న పారా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పారా క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి ఉదయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో పారా క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. షాట్‌పుట్, డిస్కస్ త్రో, 100, 200మీటర్ల రన్ పోటీలు సాగాయి. మొత్తం నూరు మందికి పైగా పారా క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు మంగళవారం డీఎస్ఏ అశోక్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించే అంతర్జాతీయ విభిన్నప్రతిభావంతుల దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, శాప్ కోచ్‌లు మంజుళ, జెబీవుల్లా, అనీల్‌కుమార్, నరేష్‌కుమార్, వంశీ, సంధ్య, సుబ్రమణ్యం, లక్ష్మి, అంజన్‌కుమార్, చలపతి, పారా క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

తనుశ్రీకి అంగన్‌వాడీల చేయూత


తనుశ్రీకి డిపాజిట్ బాండ్‌ను అందిస్తున్న మంత్రి

కూడేరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్కూరు గ్రామంలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త ఈశ్వరమ్మ గత సెప్టెంబరులో అనారోగ్యంతో మృతి చెందింది. భార్య మరణాన్ని జీర్ణించుకోలేక భర్త శంకరయ్య అదే నెలలో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో వారి కుమార్తె చిన్నారి తనుశ్రీ అనాథగా మిగిలింది. ఇందుకుగాను ఆ చిన్నారికి చేయూతనిచ్చేందుకు మండలంలోని అంగన్‌వాడీలు ముందుకొచ్చారు. అందరూ రూ. 30వేలు పోగు చేసి బ్యాంకులో ఆ చిన్నారి పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ డిపాజిట్ బాండ్‌ను సోమవారం వారు అనంతపురంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా చిన్నారి తనుశ్రీకి అందజేశారు. మంత్రి కేశవ్.. అంగన్‌వాడీలను అభినందించారు.

ఎమ్మెల్యే టీడీపీ శాశ్వత సభ్యత్వం


సభ్యత్వం చూపుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

యల్లనూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ లక్షరూపాయలు చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వ కార్డు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యల్లనూరు మండలం నుంచి సభ్యత్వ నమోదు తీసుకోవాలని భావించి మీ అందరి సమక్షంలో సభ్యత్వ నమోదుకు డబ్బులు చెల్లించానని తెలిపారు. పార్టీ నాయకులు విరివిగా సభ్యత్వాలు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, పుట్లూరు మండల టీడీపీ నాయకుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ లబ్ధిదారులను ఇబ్బంది పెడితే చర్యలు

యాడికి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు తమ మధ్య విభేదాలతో రేషన్ సరుకుల పంపిణీలో లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని సీఎస్‌డీటీ మారుతిప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. డీలర్ల మధ్యవివాదంతో నిలిచిపోయిన రేషన్ పంపిణీ శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం రేషన్ డీలర్లతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్‌డీటీ మాట్లాడుతూ రేషన్ డీలర్లు లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ సరుకులు అందించాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రేషన్ పంపిణీ జరగాల్సిందేనని ఆయన తెలిపారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయండి

తాడిపత్రి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్‌యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి కోరారు. ఈ మేరకు మార్కెట్‌యార్డు కార్యదర్శికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని బ్రాహ్మణపల్లి, బందార్లపల్లి, కావేరిసముద్రం, చల్లవారిపల్లి, కొట్టాలపల్లి, దిగువపల్లి, తిమ్మాపురం, చిన్నపల్లి, చిన్నపొలమడ తదితర గ్రామాల్లో రైతులు పత్తిపంటను సాగుచేశారన్నారు. కనుక యార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసి మద్దతు ధర రూ.10వేలు ఇచ్చే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు చెన్నారెడ్డి, రాజేశ్వర్‌నాయుడు, సురేష్, నాగార్జునరెడ్డి, జయరంగారెడ్డి తదితరులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యల్లనూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతపల్లి గ్రామ సమీపంలోని ఓ తోటలో పేకాటాడుతున్న పలువురిని పోలీసులు సోమవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు సమాచారం. జిల్లా సరిహద్దులోని తోటలో పేకాటాడుతున్నట్లు రూరల్ సీఐకి సమాచారం రావడంతో యల్లనూరు పోలీసులను అప్రమత్తం చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని కొందరు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి నుంచి ఏడు ద్విచక్రవాహనాలతోపాటు పెద్దమొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

యాడికి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందర ఉన్న అరుగు విషయంలో ఘర్షణ జరిగి పెద్దపుల్లారెడ్డి, చిన్నపుల్లారెడ్డి అనే ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన వేములపాడు గ్రామంలో సోమవారం జరిగింది. వేములపాడుకు చెందిన పెద్దపుల్లారెడ్డి, చిన్నపుల్లారెడ్డిల ఇంటిముందు ఉన్న అరుగును సోమవారం టీడీపీకి చెందిన రామచంద్రారెడ్డి, నారాయణ, షరీఫ్, మస్తాన్ తదితరులు తొలగించడానికి వెళ్లారు. అయితే దీనిని పెద్దపుల్లారెడ్డి, చిన్నపుల్లారెడ్డి అడ్డుకున్నారు. దీంతో వారిపై టీడీపీ వారు రాళ్లు, కట్టెలతో దాడిచేసి గాయపరిచారు. చికిత్స నిమిత్తం ఇరువురిని తాడిపత్రికి తరలించారు. అక్కడి నుంచిమెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. సమాచారం అందుకున్న సీఐ ఈరన్న సిబ్బందితో కలిసి వేములపాడులో పర్యటించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేస్తామని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్ చోరీలపై ప్రత్యేక దృష్టి


దైవాలమడుగులో రైతులతో మాట్లాడుతున్న సీఐ ఈరన్న

యాడికి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయపొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్ చోరీలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని సీఐ ఈరన్న తెలిపారు. మండలంలోని దైవాలమడుగు, చందన గ్రామాల్లో సోమవారం ఆయన గస్తీ నిర్వహించారు. చోరీలు జరిగిన బాధిత రైతులతో మాట్లాడారు. తోటల్లో ఏ చిన్న చోరి జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. దొంగలపై ప్రత్యేకదృష్టి సారిస్తామన్నారు. కేబుల్, ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

చెక్కు పంపిణీ

ఉరవకొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం చాబాల గ్రామానికి చెందిన పెద్ద వన్నక్కకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.1.14లక్షలు మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కును టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు అనంతపురంలోని రాంనగర్‌లో గల తన నివాసంలో సోమవారం లబ్ధిదారురాలికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎర్రిస్వామి, అనంత్, లింగమూర్తి, గోపాల్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపేటలో రూ.5లక్షల వ్యయంతో చేపట్టనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను టీడీపీ పట్టణ కన్వీనర్ రామాంజినేయులు సోమవారం భూమిపూజ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం రోడ్లను తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి వచ్చాక అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ఉరవకొండలో రూ.1.90కోట్ల వ్యయంతో సీసీరోడ్లు, డ్రైన్‌లు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. నాయకులు తిమ్మప్ప, ప్యారంకేశవానంద, బాబు, సుంకన్న, సుదర్శన్, రవీంద్ర, రమేష్, బాలాజీ, వార్డు సభ్యులు ప్రభాకర్, నిరంజన్‌గౌడ్ పాల్గొన్నారు.


సమాధుల వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు


శ్మశాన వాటికలో నిల్వ ఉన్న నీరు


చిన్నపాటి వర్షానికే చిత్తడిగా రోడ్డు

శ్మశాన వాటికలో సమస్యల తిష్ట

- అంత్యక్రియల నిర్వహణకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

గుంతకల్లు టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యనారాయణ పేటలో గల హిందూ శ్మశాన వాటికలో సమస్యలు తిష్ట వేశాయి. దీంతో అంత్యక్రియలు నిర్వహించాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సుమారు 70ఏళ్ల క్రితం ఈ శ్మశాన వాటికకు మున్సిపల్ అధికారులు 7 ఎకరాలు కేటాయించారు. అందులో రెండు ఎకరాలను రోట రీ కైవల్యధామంకు కేటాయించారు. వాటికలో దాదాపు 15 వార్డులకు చెందిన ప్రజలు అంత్యక్రియలు జరుపుతుంటారు. అక్కడ పలు సమస్యలు నెలకొనడంతో అంతా అసౌకర్యంగా ఉంది. ముఖ్యంగా ఆవరణ మంతా చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఎటుచూసినా మద్యం బాటిళ్లు, నీళ్ల బాటిళ్లు, పాకెట్లు దర్శనమిస్తున్నాయి. ప్రహరీ లేక పోవడంతో స్థానికులు అ క్కడికే బహిర్భూమికి వెళ్తున్నారు. ఆవరణమంతా ఎగుడుదిగుడుగా ఉండడంతో వర్షం పడితే నీళ్లు నిలిచి చిత్తడిగా మారుతోంది. శవాలను పూడ్చడానికి గుంత తవ్వితే నీరు వస్తోంది. దీంతో అంత్యక్రియలకు ఆటంకం కలుగుతోంది. ఇక ఖర్మకాండలు జరుపుకోవడానికి సరైన సౌకర్యాలు లేవు. స్నానాలకు, బట్టలు మార్చుకోవడానికి కూడా గదులు లేవు. ఇన్ని సమస్యల నడుమ అంత్యక్రియలు జరపాలంటే ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అందులో కనీసం చెత్తచెదారం, పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలను కూడా ఎవరూ తొలగించడం లేదని మండిపడుతున్నారు.

ప్రారంభానికి నోచుకోని క్రిమిటోరియం

శ్మశాన వాటికలో క్రిమిటోరియం నిర్మాణానికి 2022లో పనులు చేపట్టారు. నిర్మాణానికి రూ.1కోటి నిధులు కేటాయించారు. క్రిమిటోరియం పనులు పూర్తి చేశారు. అయితే శవాలను దహనం చేయడానికి కావాల్సిన పరికరాలను సమకూర్చలేదు. దీంతో ఆ ప్రాంగణం కాస్తా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. భవనాన్ని ఏజెన్సీ నిర్వాహకులు మున్సిపాలిటీకి అప్పగించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

చెత్తాచెదారాన్ని మేమే తొలగించుకుంటున్నాం



నాలుగేళ్ల నుంచి శ్మశాన వాటిలోని మా పెద్దల సమాధుల వద్ద ఉన్న చెత్తచెదారాన్ని, పిచ్చిమొక్కలను తామే తొలగించుకుంటున్నాం. శ్మశానవాటికలోకి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కూడా లేదు. వర్షం వస్తే బురదతో నిండిపోతోంది. ఆసమయంలో వెళ్లాలంటే నరకమే.

-లక్ష్మీనారాయణ, ఆర్టీవీధి

సౌకర్యాలు కల్పించాలి



అంత్యక్రియలను నిర్వహించేందుకు వచ్చిన ప్రజలకు కనీసం సౌకర్యాలు లేవు. రోడ్డు, స్నానాలు చేసేందుకు సౌకర్యం లేదు, బట్టలు మార్చుకునేందుకు గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు సౌకర్యం, ప్రహరీ నిర్మాణం వెంటనే చేపట్టాలి.

- వీరభద్రస్వామి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి

భవనాన్ని వినియోగంలోకి తెస్తాం: ఎమ్మెల్యే


భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృషివిజ్ఞాన కేంద్రం ఎదురుగా నిరుపయోగంగా ఉన్న రైతు శిక్షణ కేంద్రం భవనాన్ని వినియోగంలోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. స్థానిక పశువైద్య అధికారులతో కలిసి సోమవారం ఆయన నిరుపయోగంగా ఉన్న ఆ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాడి రైతులకు శిక్షణ కల్పించేందుకు రూ.60 లక్షల వ్యయంతో భవనం నిర్మించారని, దీనిని 2016 నుంచి నిరుపయోగంగా ఉంచడం దురదృష్టకరమని అన్నా రు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా ఈ భవనాన్ని మరలా వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. మంత్రి అచ్చంనాయుడు, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ఈ భవనం రైతులకు ఉపయోగపడేలా చేస్తామన్నారు. ఆ విధంగా స్థానిక పశువైద్యాధికారులు కూడా ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ఈ భవనానికి ఎటువంటి సదుపాయాలు అవసరమో ప్రతిపాదనలో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

కళ్యాణదుర్గం పట్టణంలో జరిగే పట్టాభి రామస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆవిష్కరించారు. స్థానిక ప్రజావేదిక వద్ద ఆలయ అర్చకులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వాటిని విడుదల చేశారు. ఈ నెల 12 నుంచి ఆలయంలో బ్రహ్మోత్సవ వేడుకలను పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే రూ.50 వేలు వితరణ చేశారు. ఆలయ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని హామీనిచ్చారు.

సామాజిక సేవలో భాగస్వాములు కండి

- ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు
- బెణెకల్లులో వాటర్‌ప్లాంట్ ప్రారంభం


వాటర్‌ప్లాంట్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విప్ కాలవ

కణేకల్లు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల ని, అటువంటి వారికి ప్ర భుత్వం కూడా సహకరిస్తుందని విప్ కాలవ శ్రీ నివాసులు పేర్కొన్నారు. మండలంలోని బెణెకల్లు గ్రామంలో బాలవికాస్ అనే స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం, గ్రామస్థులు సంయుక్తంగా ఏర్పాటు చేసి న వాటర్‌ప్లాంట్‌ను సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు వరంగల్‌కు చెందిన బాలవికాస్ స్వచ్ఛందసంస్థ దాదాపు రూ. 3.70 లక్షలు అందించగా.. గ్రామస్థులు మరో రూ. 80 వేలను అందించారని, వీరి కృషికి ప్రభుత్వం కూడా స్పందించి మరో రూ. 5 లక్షల నిధులను అందించిందని తెలిపారు. ఇలా సంయుక్తంగా ప్రజల కోసం వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బెణెకల్లుకు చెందిన ఓ జనసేన నాయకుడు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు మెయిల్ చేసి ప్రభుత్వం ద్వారా వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి నిధులు కావాలని అడిగారని, ఇందుకు స్పందించిన పవన్ కళ్యాణ్ ప్రభుత్వం ద్వారా రూ. 5 లక్షలు మంజూరు చేయించారని గుర్తు చేశారు. పభుత్వం ప్రజలకు సేవ చేసేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ప్రజలు కూడా బాధ్యతయుతంగా మెలిగి ప్రభుత్వ వనరులను కాపాడుకోవడంతో పాటు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు మంజునాథ్‌గౌడ్, బాలవికాస్ ప్రతినిధి మధుసూదన్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ లాలెప్ప, బెణెకల్లు నాయకులు రమేష్, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో శ్మశానాలనూ వదల్లేదు

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అసహనం


కోడిమూర్తిలో శ్మశాన వాటికను ఆక్రమించారని ఫిర్యాదు చేస్తున్న ఎస్సీ కాలనీవాసులు

యల్లనూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో నాయకులు శ్మశాన స్థలాలను కూడా వదలకుండా ఆక్రమించారని ఎమ్మెల్యే బండారుశ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇవ్వగా.. తీసుకుని పరిశీలించారు. కోడిమూర్తి గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీవాసులు గత వైసీపీ పాలనలో తమ శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించారని, న్యాయం చేయాలని కోరుతూ అర్జీ ఇచ్చారు. అలాగే గడ్డంవారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన వారు కూడా శ్మశాన వాటిక ఆక్రమణకు గురైందని, దీంతో శవాలను ఎక్కడ పూడ్చాలో అర్థం కావడం లేదని ఫిర్యాదు చేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ వైసీపీ పాలనలో నాయకులు ఇసుక, మట్టినే కాకుండా శ్మశానాలను సైతం వదలలేదని అసహనం వ్యక్తం చేశారు. వెంటనే తహశీల్దార్ రాజాకు ఈ రెండు సమస్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇంకా పలు గ్రామాల ప్రజలు వివిధ సమస్యలపై సుమారు 98 అర్జీలను ఎమ్మెల్యేకు ఇచ్చారు. వాటిలో చాలా వరకు రెవెన్యూ సమస్యలవే ఉన్నాయి. పరిష్కారవేదికలో ఇచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపీడీఓ వాసుదేవరెడ్డికి, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

31న సంగీత విభావరి

తాడిపత్రి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన ఈనెల 31వ తేదీన రాత్రి సంగీత విభావరి ఏర్పాటు చేయనున్నారు. పట్టణంలోని 10 ఏళ్ల అనుభవనం పైబడిన గాయనీగాయకులచే సంగీత విభావరి జరగనుంది. ఆసక్తి గల వారు ఈనెల 10లోగా పేర్లను నమోదు చేసుకోవాలని, 9848126055, 9988247771లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

విద్యుత్ చార్జీల పెంపు దారుణం


తాడిపత్రిలో ధర్నా చేస్తున్న రైతు సంఘం, సీపీఐ నాయకులు

తాడిపత్రి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌చార్జీల పెంపు, స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, సీపీఐ మండల కార్యదర్శి నాగరంగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యుత్ చార్జీలు పెంచమని కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామిని నిలబెట్టుకోవాలన్నారు. రైతులకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కుతూ వ్యవసాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్లను బిగించడం దారుణమన్నారు. ఇప్పటికైనా విద్యుత్‌చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ధర్నాలో నాయకులు నారాయణరెడ్డి, ఓబులేసు, గోపాల్, సూరి, రాములమ్మ, సాలమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ మండలకేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద సీపీఐ నాయకులు నిరసనకు దిగారు. జిల్లా సీనియర్ నాయకుడు సూర్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి వెంకటరాముడుయాదవ్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం మోపడం సరికాదన్నారు. ప్రజలు కరెంట్‌బిల్లులు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనతగ్గించాలని డిమాండ్ చేశారు. నాయకులు నారాయణ, రంగస్వామి, హుస్సేన్‌పీరా, సుధాకర్‌గౌడ్, ఆదినారాయణ, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని పట్టణంలోని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ.. స్థానిక ఆలూరు రోడ్డులో గల ఏడీఏ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఐదేళ్ల వరకు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి, కేవలం 5నెలల్లోనే ప్రజలపై అదనపు భారం మోపిందన్నారు. పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలన్నారు. అనంతరం ఏడీఓ నాగేంద్రకు వినతి పత్రాన్ని అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్‌చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, వైసీపీ జిల్లాప్రధాన కార్యదర్శి గాది లింగేశ్వరబాబు, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 8 వినతులు

రాయదుర్గం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి ఎనిమిది వినతిపత్రాలు వచ్చినట్లు తహశీల్దార్ నాగరాజు తెలిపారు. ఇంటి పట్టాల కోసం నాలుగు, భూసమస్య కోసం రెండు, ఆర్థిక సాయం కోసం రెండు వినతుల వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రంగస్వామి, హార్టికల్చర్ అధికారి మౌనిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

పెద్దపప్పూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని శింగనగుట్టపల్లి గ్రామంలో గత నవంబరు 21వ తేదీ జరిగిన సునీత హత్య కేసుకు సంబంధించి సోమవారం నిందితులు చిన్నవీరయ్య అతని భార్య పద్మావతిని అరెస్ట్‌చేసినట్లు పెద్దవడుగూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు గ్రామశివార్లలో ఉన్న నిందితులను ఎస్ఐ నాగేంద్రప్రసాద్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారని చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత

గుత్తి రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వఉంచిన 120 క్వింటాల రేషన్ బియ్యంను ఎస్ఐ సురేష్ తన సిబ్బందితో కలిసి దాడులు చేసి పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు మండలంలోని తొండపాడు వద్ద సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. గ్రామశివారులో కొండ వద్ద గుత్తికి చెందిన శేఖర్ అనే వ్యక్తి అక్రమంగా 120 క్వింటాలను బియ్యాన్ని ఐషర్ వాహనంలోకి లోడు చేస్తుండగా పట్టుకొని సీజ్ చేశారు. వాహనాన్ని గుత్తి పోలీస్ స్టేషన్ కు తరలించారు. నిందుతుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తికోట సందర్శన

గుత్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పురాతన గుత్తికోటను పురవస్తుశాఖ జిల్లా అధికారి యోగేష్ సోమవారం సందర్శించారు. ముందుగా రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కోటలోని కట్టడాలను పరిశీలించారు. పర్యాటకుల కొరకు నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్లు, తాగునీటి ఆర్వో ప్లాంట్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పురవస్తుశాఖ సిబ్బంది శైలేంద్రకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయపొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

కూడేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుట్ల -2వ కాలనీ సమీపంలో అటవీ ప్రాంతంలోనున్న వ్యవసాయ పొలాల్లో గుర్తుతెలియని రెచ్చిపోయారు. గత రెండ్రోజుల క్రితం అటవీ ప్రాంత సమీపంలోని డి. గోపాల్‌రెడ్డి, ఆదిశేషారెడ్డి, వై గోపాల్‌రెడ్డిలకు చెందిన తోటల్లో ట్రాన్స్ ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్‌ను ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితులు సోమవారం తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తక్షణం ట్రాన్స్ ఫార్మర్లు అమర్చాలని కోరారు. లేకపోతే పంటలకు నీటిని అందించలేమని వారు వాపోయారు.

ముచ్చుకోట రిజర్వాయర్‌కు హెచ్చెల్సీ నీరు

- గేట్లు ఎత్తి విడుదల చేసిన ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి


గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దపప్పూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకోట గ్రామంలో ఉన్న రిజర్వాయర్‌ను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి సోమవారం సందర్శించారు. అనంతరం హెచ్చెల్సీ ద్వారా ఆ రిజర్వాయర్‌కు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ముచ్చుకోట రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేస్తామని హా మీ ఇచ్చానని, ఆ హామీ మేరకు ఇప్పుడు నీటిని విడుదల చేశామని తెలిపారు. రైతులకు ఏ కష్టం రానివ్వకుండా చూసుకుంటానని అన్నారు. రిజర్వాయర్‌లో ఉన్న చిన్న చిన్న సమస్యలను త్వరగా పూర్తిచేస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ శకుంతల, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథరెడ్డి, మండల కన్వీనర్ గుర్రి రఘునాయుడు, నాయకులు రామకృష్ణారెడ్డి, హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణస్వామి తదితరులు ఉన్నారు.

రెండు మున్సిపాలిటీలు భేష్: కలెక్టర్


తాడిపత్రి, కళ్యాణదుర్గం కమిషనర్లకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీలో తాడిపత్రి, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలకు ప్రశంసలు దక్కాయి. తాడిపత్రి మున్సిపాలిటీలో 98.29 శాతం పూర్తి చేసి మొదటి స్థానంలో నిలిపిన కమిషనర్ శివరామకృష్ణ, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో 97.49 శాతం పూర్తి చేసి ద్వితీయ స్థానంలో నిలిపిన కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్‌ను సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రశంసించారు. కలెక్టరేట్‌లో ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారు. తాడిపత్రి మున్సిపాలిటీలోని రెడ్డివారిపాళ్యం రెవెన్యూ సెక్రటరీ హుస్సేన్‌పీరా 100 శాతం, బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ వీఆర్ఓ యుగంధర్ ఉదయం 6.30లోగా 50 శాతం పింఛన్లు పంపిణీ చేసినందుకు ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపి ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి అభినందనలు అందుకోవడం శుభపరిణామమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, పింఛన్‌ల పంపిణీ ఇన్‌చార్జి అజ్మతుల్లా పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ వీఆర్వోగా పనిచేస్తున్న యుగంధర్ కలెక్టర్ వినోద్‌కుమార్ చేతులు మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. లబ్ధిదారులకు 98 శాతం పింఛన్ పంపిణీ చేసినందుకు వీఆర్వోను కలెక్టర్ అభినందిస్తూ ప్రశంసాపత్రం అందించారు.

క్రైస్తవుల సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే గుమ్మనూరు


కేక్‌ను కట్‌చేస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పాటు పడుతోందని, నియోజకవర్గంలోని క్రైస్తవులు, క్రైస్తవ సంఘాల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని రైల్వే కమ్యూనిటీ హాల్‌లో సోమవారం ఉదయం సపోజ్ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని అంజలీ నగర్‌కు చెందిన యేసు క్రీస్తు సంఘం రెవరెండ్ పాస్టర్ ఓబులేశు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రీ క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ క్రైస్తవులు ఇప్పటికే పలు సమస్యలను తన దృష్టికి తెచ్చారన్నారు., వాటిని తప్పక పరిష్కరిస్తానని తెలిపారు. నెల రోజులపాటు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, గుమ్మనూరు నారాయణ, తలారి మస్తానప్ప, పాస్టర్లు కేఎన్‌జే పాల్, సోలమన్, పరిశుద్ధరావు, ఇమానియేల్, ఆంథోని, నగేశ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోండి

యాడికి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో యథేచ్ఛగా కొనసాగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాలని జనసేన నాయకులు కోరారు. ఈ మేరకు మండలకేంద్రంలో సోమవారం తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జనసేన మండల కన్వీనర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. మండలంలో దళారులు రేషన్ బియ్యం క్రయ, విక్రయాలు జోరుగా కొనసాగిస్తున్నారన్నారు. మండలంలో సేకరించిన రేషన్ బియ్యం పక్కరాష్ట్రాలకు తరలివెళుతున్నాయని తెలిపారు. దీనిపై గతంలో కూడా అధికారులకు ఫిర్యాదుచేశామన్నారు. రెవెన్యూ, సివిల్‌సప్లైస్ అధికారులు రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు జాకీర్‌హుస్సేన్, వెంకటేష్, శివప్రసాద్, ఓబయ్య, చంద్రశేఖర్, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అనుగుణంగా బస్సులు నడపాలి

రాయదుర్గంరూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో విద్యాభ్యాసం సాగిస్తున్న విద్యార్థులకు అనుగుణంగా పాఠశాల సమయానికి బస్సు సర్వీసులు నడపాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు శశికుమార్ కోరారు. ఈ మేరకు ఆర్టీసీ డిపో కార్యాలయంలో సోమవారం మేనేజర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు బడి సమయాలకు బస్సులు లేక చాలా మంది చదువుకు దూరం అయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా విద్యార్థులకు సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలని కోరారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. నాయకులు అభిషేక్, మున్నా, ప్రదీప్, భీమేష్, జగదీష్, రమేష్ పాల్గొన్నారు.

పంటల బీమా పోస్టర్ల విడుదల

కళ్యాణదుర్గం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంటలకు బీమా చేస్తే, అది ఒక రక్షణ కవచంలా రైతులకు ఉపయోగపడుతుందని, అందుకోసం ప్రతి ఒక్క రైతు పంటలకు బీమా చేయించాలని ఆర్డీఓ వసంతబాబు తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆర్డీవోతో పాటు ఏడీఏ ఎల్లప్ప పంటల బీమాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు ఈ పంటల బీమాపై అవగాహన పెంచుకోవాలన్నారు. తుఫాన్‌లు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వలన పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు ఈ పంటల బీమా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న రైతులందరూ ఈ బీమా పథకంలో చేరడానికి అర్హులన్నారు. తహసీల్దార్ భాస్కర్, ఉద్యానశాఖాధికారి కృష్ణ తేజ, ఇన్సూరెన్స్ అధికారులు మురళి, నబీ, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత


ఆస్పత్రిలో పింఛన్ అందిస్తున్న సచివాలయ ఉద్యోగి

విడపనకల్లు డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బెస్త హర్షిత అనే చిన్నారి గత కొన్ని రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధ పడుతూ కర్నూలులోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న విడపనకల్లు సచివాలయ ఉద్యోగి నిఖిల్ సోమవారం కర్నూల్‌కు వెళ్లి ఆసుపత్రిలో చికిత్స పొందున్న హర్షితకు ఫించన్ సొమ్ము రూ.10వేలు అందించారు.